# కరీంనగర్ వార్త

కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

శుక్రవారం 24, ఏప్రిల్ 2026 | 16 పేజీలు




## డీ.ఎం.హెచ్.ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**జీత బిల్లులు ప్రాసెస్ చేయడానికి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

2వ పేజీలో...



# నాణ్యమైన భోజనాన్ని.. అందజేయాలి

**విద్యార్థుల మెనూ ప్రకారం అల్పాహారం భోజనం అందజేయాలి**

**గృహాల నుండి ఏమైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం భోజనం అందజేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారుప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సందర్శించారు.



2 లో..

ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉదయం అల్పాహారాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను, వంటగది పరిశుభ్రత,

2 లో..



# డంపింగ్ యార్డ్ రద్దు కోసం.. పోరాటం

**ఊరుకదలిందిరా జంబాయిరే.. హుజూరాబాద్ కదిలిందిరా జంబాయిరే..**

**నాలుగు గ్రామాల మీదుగా పాదయాత్ర చేసిన.. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి.. వేలాది మంది జనం..**

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** అనాడు ఉమ్మడి రాష్ట్ర పాలనలో అతలాకుతలమై.. అన్నింటిలో వెనుకబాటుకు గురైన తెలంగాణ ప్రాంతం 2001నుండి 2014వరకు తెగించి సబ్బండ వర్గాల ప్రజల సారధ్యంలో ఊరు, వాడ, పల్లె, పట్నం అంత ఒక్కతాటిపైకి వచ్చి ఉవ్వెత్తిన లేచిన ఆ ఉద్యమానికి పాలక ప్రభుత్వాలు తలొగ్గి తెలంగాణ ప్రజల చేతిలో ప్రత్యేక రాష్ట్రాన్ని చేతిలో పెట్టింది. ఆ 14 సంవత్సరాల ఉద్యమస్ఫూర్తిని పునికిపుచ్చుకున్న హుజురాబాద్ గడ్డ మీది ప్రజల ప్రాణాలకు డంపింగ్ యార్డు ముప్పు పొంచి ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని 40రోజులుగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వంపై ఉవ్వెత్తిన లేచిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం చివరకు గ్రామాలకు పాకింది.



# కన్నప్రేమ కరువైందా?

**మూత్రశాలలో పసిపాప విలవిల!**

**సిరిసిల్ల కొత్త బస్టాండ్‌లో హృదయ విదారక ఘటన**

**మానవత్వాన్ని చాటిన మహిళ**

**సిరిసిల్ల బ్యూరో , ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** అమ్మ పొత్తిళ్లలో ఒదిగిపోవాల్సిన ఆ పసిప్రాణం.. పుట్టగానే పరాయిపాలైంది. కనిపెంచాల్సిన కన్నవారే కాలయములై ఆ పసికందును అనాథగా వదిలేశారు. లోకం పోకడ తెలియని ఆ ఆడబిడ్డను అక్కున చేర్చుకోవాల్సింది పోయి, మురికి కూపమైన మూత్రశాలలో విసిరేసిన హృదయ విదారక ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది.

2 లో..



2 లో..



# జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

**మృతురాలి బంగారు కమ్మలు ఆసుపత్రి సిబ్బంది మాయం...?**

**బంగారు కమ్మలు ఇవ్వాలని బాధితుల ఆందోళన**

**పోలీసుల రంగ ప్రవేశం**

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** జగిత్యాలలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో దారుణం జరిగింది. మృతురాలి బంగారు చెవి కమ్మలు ఆసుపత్రి సిబ్బంది మాయం చేశారని భాధితులు ఆరోపించారు. గురువారం ఆసుపత్రిలో బంగారు కమ్మలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బాధితులు ఆందోళన చేయగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## నాణ్యమైన భోజనాన్ని అందజేయాలి

మొదటి పేజీ తరువాయి..

నీటి వినియోగం, నిల్వ విధానాలు, కిచెన్ షెడ్ నిర్వహణపై ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ వీక్ నిర్వహణ ద్వారా ప్రజా ప్రభుత్వం సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నదని తెలిపారు. సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రతి విద్యార్థికి సమయానికి అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూప్రభుత్వం సంక్షేమ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తు బలపడుతుందని పేర్కొన్నారు. కళాశాలల్లో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు ఉత్తమ వసతులు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూవిద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి అందించే అల్పాహారం నాణ్యంగా, పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు. వంటశాలల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సూచించారు. సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని, విద్యార్థులకు సురక్షితమైన, శుభ్రమైన వాతావరణంలో అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా సంక్షేమ అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, తహసీల్దార్, ఎంపిడివో, మండల విద్యాధికారి, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ రద్దు కోసం.. పోరాటం

మొదటి పేజీ తరువాయి..

అందులో భాగంగానే హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగా హుజురాబాద్ బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన సతీమణి శాలిని రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ఎస్సి కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు గందె రాధికశ్రీనివాస్, తక్కల్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కల్లపల్లి సత్యానారయణ రావు, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, వర్దినేని రవీందర్‌రావు, ప్రతాప మంజుల కృష్ణ, పొనగంటి సంపత్, బచ్చు శివకుమార్, పాతకాల రమేష్, తాళ్లపెల్లి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో హుజురాబాద్, పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లి, సిర్సపల్లి, గణేష్‌నగర్, సిర్సపల్లి క్రాస్ రోడ్ మీదుగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పలు గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు రద్దుకై వ్యతిరేకంగా పాటలు పాడుతూ, నినాదాలు చేస్తూ.. ఊరుకదలిందిరా జంబాయిరే.. హుజురాబాద్ కదిలిందిరా జంబాయిరే.. అంటూ వేలాది మందిని కూడగట్టుకుని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా మధ్యాహ్నం నుండి సాయంత్రం పొద్దుపోయే వరకు పాదయాత్ర కొనసాగించారు.

పాదయాత్రలో ఆయా గ్రామాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రజాసంఘాల నాయకులకు స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి స్వాగతం పలికారు. మహిళలు ముఖ్యంగా యువతి, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని డంపింగ్ యార్డు వ్యతిరేకంగా తమ ఆవేదనను వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా అశేశంగా తరలివచ్చిన ఆయా గ్రామాల ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టే.. ప్రభుత్వ నిర్ణయాలను గొంతులో ప్రాణం ఉన్నంత వరకు తాను అంగీకరించనని, డంపింగ్‌యార్డును రద్దు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే వరకు తమ ప్రజాపోరాటం ఆగదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్పష్టం చేసారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా నాటి తెలంగాణ ఉద్యమాన్ని తలపించే విధంగా నిత్యం నిరాహారదీక్షలు ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతున్నాయని, కొందరు ప్రజా ఉద్యమాన్ని వక్రీకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వారికి ప్రజల చేతిలో పరాభవం తప్పదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. గత కొద్ది మాసాలుగా హుజురాబాద్-సిర్సపల్లి, పోతిరెడ్డిపేట, గణేష్‌నగర్ పరిసర గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డు నిర్మాణం జరిగితే తమ ప్రాణాలతో పాటు పశుపక్షాదులు, పంటభూములు, నష్టపోతామని, భూగర్భజలాలు తీవ్ర కలుషితమూపోతాయని, ప్రజలు కంటిమీద కునుకులేకుండా రాత్రులు గడుపుతున్నారని, ప్రజల ప్రాణాలను వారి మనోభావాలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని డంపింగ్ యార్డును రద్దు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెలేగా నాపై కోపం ఉంటే ఎన్ని కేసులైన నాపై పెట్టండి.. తప్పుచేస్తే నన్ను ఉరితీయండి.. తాను బతికినంతకాలం ప్రజాసమస్యలపై పోరాడుతానని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తేల్చిచెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే అనేక విధాలుగా అభివృద్ధికి నిధులు రాక, అష్టకష్టాలు పడుతున్నారని ఇప్పుడు ములిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ప్రజల దుస్థితి ఆగ్యమగోచరంగా మారిందన్నారు. హుజురాబాద్ అంబేద్కర్ చౌక్ వద్ద సబ్బండ వర్గాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిత్యం మండుతున్న ఎండల్లో నీరహారదీక్షలు కొనసాగిస్తున్నారని, దీక్షల్లో పాల్గొన్న వ్యక్తులకు ఏ చిన్న హానీ జరిగిన రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవల్సి ఉంటుందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. ఈ పాదయాత్ర ద్వారా హుజురాబాద్ ప్రాంత ప్రజల గళాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వినిపించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ఆకినపల్లి శిరిష, పొనగంటి విజయలక్ష్మి, గాజుల భాస్కర్, పొనగంటి శ్రీధర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పలు గ్రామాల ప్రజలు వేలాది మంది పాల్గొన్నారు.

# డీ.ఎం.హెచ్. ఓ కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



పెద్దపల్లి, ప్రభాతవార్త:

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీ ఎం.డి. అజీమ్ ఖాన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ శ్రీ ఓ. రాము ను సస్పెండ్ చేస్తూ లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్ల జీతాలు పోర్టల్‌లో ప్రాసెస్ చేయడం కోసం సంబంధిత అధికారులచే నగదు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ నిర్వహించగా, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము జీత బిల్లులు సిద్ధం చేయడం, ప్రాసెస్ చేయడం విషయంలో అక్రమాలు, అధికార దుర్వినియోగం చేసినట్లు తేలినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా ల్యాబ్ టెక్నీషియన్ల నుంచి నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో పాటు, సంబంధిత వివరాల్లో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ప్రారంభించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాధారాల పరిశీలన మేరకు, సూపరింటెండెంట్ ఎం.డి. అజీమ్ ఖాన్ మరియు సీనియర్ అసిస్టెంట్ ఓ. రాము ను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ ను వీడరాదని, నిబంధనల ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించబడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# కన్నప్రేమ కరువైందా?..

మొదటి పేజీ తరువాయి..

ఘటన వివరాల్లోకి వెళ్తే..జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు పుట్టిన వెంటనే ఉన్న ఓ ఆడ పసిపాపను మూత్రశాలలో వదిలివెళ్లారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ఆ పసికందు విలవిలలాడుతూ ఏడవడం మొదలుపెట్టింది. మూత్రశాల వైపు వెళ్లిన ఓ మహిళా ప్రయాణికురాలు పాప ఏడుపు విని గమనించగా, రక్తంతో ఉన్న ఆ పసిగుడ్డును చూసి చలించిపోయింది. వెంటనే ఆమె పోలీసులకు మరియు అధికారులకు సమాచారం అందించింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. అనాథగా పడి ఉన్న ఆ చిన్నారిని రక్షి ంచి, హుటాహుటిన జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆ పాపకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అదృష్టవశాత్తూ పాప ప్రాణాపాయం నుంచి తప్పించుకుందని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

ఆడపిల్ల అన్న కసితోనేనా?కళ్లు కూడా విప్పని ఆ పసిపాపను మూత్రశాలలో పడేయడం స్థానికులను కలచివేసింది. ఖిఖిఆడపిల్లఖిఖి అన్న కారణంతోనే ఇలా చేశారా? లేక మరేదైనా కారణమా? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. బస్టాండ్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, పాపను వదిలివెళ్లిన కసాయి వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. ఒకవైపు సాంకేతిక రంగంలో దూసుకుపోతున్నా, మరోవైపు ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

మొదటి పేజీ తరువాయి..



జగిత్యాల పట్టణ పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం జగిత్యాల ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు గురువారం మృతి చెందగా కుటుంబ సభ్యులు అంబులెన్స్ లో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మృతురాలికి చెందిన బంగారు చెవి కమ్మలు కనబడపోయేసరికి బాధితులు జగిత్యాల ఆసుపత్రికి చేరుకుని బంగారం ఆసుపత్రికి చెందిన సిబ్బంది మాయంచేశారని ఆరోపించారు. ఆసుపత్రికి చెందిన ఇద్దరు మహిళా సిబ్బంది బంగారు కమ్మలు మాయం చేసారాని ఆరోపిస్తూ ఆసుపత్రిలో ఆందోళన చేశారు. మా బంగారం ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. ఆసుపత్రి అధికారులు, సిబ్బంది, బాధితులతో పోలీసులు మాట్లాడి ఆందోళనను విరామింపజేశారు.

# వరి ధాన్యం కొనుగోలులో గింజ కటింగు ఉండదు

సిబిఐ విచారణకు బిజెపి ప్రభుత్వం కాలయాపన
హరీష్‌రావు, కేటీఆర్ బహిరంగ చర్చకు సిద్ధమా
పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు



**కాల్వశ్రీరాంపూర్ ప్రభాతవార్త:** మండలంలోని మడిపల్లికాలనీ, పెగడపల్లి, గంగారం, పందిళ్ళ, లక్ష్మీపురం, ఇప్పలపల్లి, అరేపల్లి, తారుపల్లి ,మిర్జంపేట, కాల్వ శ్రీరాంపూర్ గ్రామాల్లో గురువారం రోజున అధికారులు, స్థానిక నాయకులతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు . కాల్వశ్రీరాంపూర్ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ...కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీర్మానం చేస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను కాపాడేందుకు ఈ విచారణ ను కాలయాపన చేస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కోర్టు ఇచ్చిన తీర్పుతో బిఆర్ఎస్ నాయకులు జబ్బులు చరుచుకుంటున్నారని, కోర్టు తీర్పులో కమిటీ వేయడంలో ప్రభుత్వం తప్పు లేదని, కమిటీ రిపోర్ట్ వాస్తవాలు, అవాస్తవాలు గ్రహించామని కెసిఆర్ హరీష్ రావులను ఇప్పుడే అరెస్టు చేయకండి అని తీర్పు ఇచ్చిందని ప్రభుత్వమును కోర్టు ఎక్కడ తప్పు పట్టలేదు అన్నారు. మళ్లీ దానిమీద క్షుణ్ణంగా ఆలోచించండని కోర్టు తీర్పు ఇచ్చింది అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం, కడితే అందులో బుంగలు పడ్డది నిజము కాదా అని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిన విషయంపై అక్కడికి ఎవరు పోకుండా వారి తప్పులు కప్పిపుచ్చుకోవడానికి బి ఆర్ ఎస్ పారా మిలటరీ దళాలను పెట్టింది కూడా నిజము కాదా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఉమ్మడి జిల్లాల్లో కనీసం 1000 ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదు అన్నారు. మెదక్ జిల్లా కోసం మల్లన్న సాగర్, కొండ పోచమ్మ రిజర్వాయర్ కట్టుకొని ఇక్కడ నీళ్లను తీసుకపోవడానికి ప్రయత్నం చేశారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక కాళేశ్వరం నుంచి చుక్క నీరు కూడా రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచే సాగునీరు అందుతుంది అన్నారు. ఎస్సారెస్పీ షెటర్లు పోతే గత ప్రభుత్వం ఎక్కడ కూడా ఒక్క షెటర్ కూడా పెట్టలేదు అన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ జవహర్ లాల్ నెహ్రూ శంకుస్థాపన చేస్తే ఇందిరాగాంధీ ప్రాజెక్టు ప్రారంభించి కాల్వలను తవ్వించడం జరిగిందని అదే కాలువలకు టిడిపి ప్రభుత్వం లైనింగ్ వేసింది అన్నారు. మీరు ఏమి చేశారన్నది హరీష్ రావు, కేటీఆర్ బహిరంగ చర్చకు రమ్మని అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీపాద ఎల్లంపల్లి, మీడ్ మానేరు, కడెం, ఎస్సారెస్పీ, ప్రాజెక్టులు కట్టడంతో పాటు వరద కాలువలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే తవ్వించింది అన్నారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులు కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ చేయించండని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఈ రెండు పార్టీలు ఒకటేనని ఆయన అన్నారు. నేషనల్ డ్యాం అథారిటీ అధికారి కాళేశ్వరం సందర్శిస్తే కేంద్ర మంత్రి బండి సంజయ్ నువ్వెందుకు పోయినావు అనడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చిత్తశుద్ధి లేని మాటలు, మీ మాటలు వింటుంటే బిఆర్ఎస్, బిజెపి కలిసి పోవాలని ఉన్నట్టుంది అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ అవినీతి జరిగిందని సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి నివేదిక ఇచ్చారని ఈ నివేదికపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రి మండలి తో కూర్చొని మాట్లాడడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ప్యాక్స్ స్పెషల్ ఆఫీసర్ పి .సురేందర్ రెడ్డి, మానిటరింగ్ అధికారి ఇమ్రాన్ మహమ్మద్, సీఈవో కోలేటి శ్రీనివాస్, ఏపీఎం లవ కుమార్, మార్కెట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేనసదయ్య, ఎండీ మునీర్, తులా మనోహర్ రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు మరియు మాజీ ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ఐకెపి సీసీలు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహశీల్దార్‌కు ఘన సన్మానం

జూలపల్లి, ప్రభాతవార్త:



జూలపల్లి మండల తహశీల్దార్‌గా బి. దత్తు ప్రసాద్ మంగళవారం స్థానిక కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సందడిగా మారింది. బాధ్యతలు చేపట్టిన నూతన తహశీల్దార్ కు స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సాదర స్వాగతం పలికారు. తహశీల్దార్ బి. దత్తు ప్రసాద్ ని నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. తహశీల్దార్ స్పందిస్తూ.. నిబంధనల మేరకు పారదర్శకమైన పాలన అందిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు తొగరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాంపల్లి సంపత్ కుమార్, నల్ల నరేందర్ రెడ్డి, పాఠకుల అనిల్, కుంటూరి లక్ష్మయ్య, లంక స్వామి, ఆర్ఐ భవాని ప్రసాద్, అడ్డగుంట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుల్లపై కేసు నమోదు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:

మండలములోని తాల్లళ్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ ఐ అశోక్ గురువారం తెలిపారు. సమాచారం మేరకు దాడి చేయగా చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సింగోజి రాజు, బెజ్జంకి మండలం కల్లెపల్లికి చెందిన శ్రీనివాస్, రేపాక గ్రామానికి చెందిన మీసాల బాబు, తాళ్ళల్లపల్లి గ్రామానికి చెందిన నూనె హరీష్ అనే వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారి దగ్గర నుండి 19 వేల 700 వందల నగదు, ఐదు బైకులు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మిగతా నలుగురు గొర్ల శ్రీకాంత్, చిలాపూర్ శ్రీకాంత్, కొలువుల శ్రీకాంత్, జోగు గోపాల్‌లు సంఘటన స్థలం నుండి పారిపోయినట్లు ఎస్ ఐ అశోక్ తెలిపారు.

## హెచ్‌ఎం సాంబయ్యకు ఘనంగా వీడ్కోలు



**ఓదెల, ప్రభాతవార్త:** ఓదెల మండలం పొత్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవలందించిన ఆదర్శ ప్రధానోపాధ్యాయులు బాషబోయిన సాంబయ్య ఉపాధ్యాయుని వృత్తిలో 36 సంవత్సరాలకుపైగా విశిష్ట సేవలు అందించిన సాంబయ్య ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చూపిన కృషి, విద్యార్థులపై ప్రేమ, సహచరులతో సౌహార్దం ప్రత్యేకంగా నిలిచాయి. 1989లో ఉపాధ్యాయునిగా సేవలు ప్రారంభించి పలు పాఠశాలల్లో పనిచేస్తూ వేలాది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలోఎంఈఓ వై రమేష్ ,వై శ్రీనివాస్, పి భద్రయ్య, ఎన్ శ్రీనివాస్, సిహెచ్ రమేష్ ,జి రఘుపతి వీ రామకృష్ణ, ఏ కిషోర్ కుమార్ , షబానా బేగం ,జి రవి ,టి రవీందర్ ,పి పద్మావతి దేవి , సిహెచ్ రమేష్, ఈ శ్రీనివాస్ ,వి హరికృష్ణ ,ఈ శ్రీనివాస్ , అజీమ్ , కే సంజీవ్, పి శంకరయ్య, రాజనర్సు. వివిధ పాఠశాల హెడ్మాస్టర్లు టీచర్స్ సర్పంచ్ అంబాల సారమ్మ కొమురయ్య , జీలగుంట సర్పంచ్ రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి , మాజీ సర్పంచ్లు అల్ల రాజిరెడ్డి. రెడ్డి శ్రీనివాస్, తాజా మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుమన్ రెడ్డి, పుల్లూరి పృథ్వీరాజ్, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెద్దాపూర్‌లో బడిబాట

జూలపల్లి, ప్రభాతవార్త:

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో గురువారం బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ పెద్దాపూర్ ప్రధానోపాధ్యాయురాలు రాగమయి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, హై స్కూల్ ఉపాధ్యాయులు రాజేశం, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చిబాబు, గణేష్, శ్రీనివాస్, జగన్, కేశవులు, రాజేష్, రమణ, పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం జరిగినది.

## నేరాలు-దారుణాలు

## పిచ్చికుక్క స్వైర విహారం -దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు

కోనరావుపేటరూరల్ ప్రభాతవార్త:

పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. ఈ పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించిన ఘటన కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన లోకుర్తి నిశాంత్, !!లోకుర్తి గంగాధర్, !!అన్విశత తో పాటు వలస కార్మికులైన ఇద్దరు ఇటుక బట్టి వారిపై దాడి చేసింది. ఈ దాడిలో గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పిచ్చికుక్క బారి నుండి గ్రామస్తులను కాపాడాలని కోరుతున్నారు.

## వీధి కుక్క దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

**ధర్మపురి, ప్రభాతవార్త:** ధర్మపురి పట్టణంలోని తోట్లవాడలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలికపై వేదిక దాడి చేయడంతో సదరు బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వీధిలోని అక్షర (6) బాలిక తమ ఇంటి ముందు ఆడుకుంటుంది. వీదిలో నుండి వెళ్తున్న ఓ కుక్క ఒకసారిగా దాడి చేయడంతో బాలికకు తీవ్ర గాయాలు అయ్యాయి. దాంతో ఆమెను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కల బెడదతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## సిరిసిల్లలో ఈదురుగాలుల బీభత్సం

గోడకూలి ఆరుగురికి తీవ్ర గాయాలు

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. అకస్మాత్తుగా వీచిన బలమైన గాలుల ధాటికి స్థానిక గాంధీ నగర్‌లో ఓ గోడ కుప్పకూలడంతో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భీకరమైన ఈదురుగాలులు వీచాయి. ఈ క్రమంలో గాంధీ నగర్ ప్రాంతంలో ఓ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ అక్కడే ఉన్న ఆరుగురు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు వారిని శిథిలాల కింద నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం వారిని హుటాహుటిన కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మిగతా వారు స్థానికంగానే చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గాంధీ నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త** మండలములోని వంతడుపుల గ్రామ పరిధిలోగల తెనుగువానిపల్లికి చెందిన కీసరి దీపక్ పై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు జరిగినట్లు స్థానిక ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు. పిర్యాదురాలు అలుక మోనిక కిరాణా దుకాణం వద్ద బీరు సీసాతో వచ్చి సిగరేటు ఉద్దెర ఇవ్వలేదని మోనికను ఆమె భర్త అరవింద్ ను నెట్టి వేసి భూతులు తిట్టడముతో పాటు కులం పేరుతో దూశించినందుకు కీసర దీపక్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## వడదెబ్బతో ఫోటోగ్రాఫర్ మృతి

**మంథని ప్రభాతవార్త:** మంథని పట్టణానికి చెందిన శ్రీ రామ ఫోటో స్టూడియో యజమాని గంధం నగేష్ (55) వడదెబ్బతో ఆకస్మికంగా మృతి చెందాడు. గురువారం విధినిర్వహణలో ముత్తారం మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనం పై వెళ్లి కర్ణవేద కార్యక్రమానికి ఫోటోలు తీసి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి వచ్చి అకస్మాత్తుగా పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికప్పుడే మృతి చెందారని వైద్యులు ధ్రువీకరించారు

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ నేను కనమేని పున్నారెడ్డి, అను నేను నా కూతురి పేరు కనమేని ఐశు (పాత పేరు) నుండి కనమేని ఐశ్వర్యరెడ్డి (కొత్త పేరు) గా మార్చు కొనుచున్నాము. చిరునామా: 18-80, ముస్తాబాద్, రాజన్నసిరిసిల్ల, తెలంగాణ-505404.

(Ro.No.3002)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# రైతులకు అండగా ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు:

మేడిపల్లి/భీమారం, ప్రభాతవార్త:

రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవార మేడిపల్లి మండలంలో పర్యటించిన ఆయన, వల్లంపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కల్వకోట గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం భీమారం మండలం ఈదుల లింగంపేట గ్రామంలో శ్రీ ఆభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. వరి ధాన్యానికి గ్రేడ్ఏ రకానికి రూ.2389 మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మెరుగైన విత్తనాలు



అందిస్తున్నామని వివరించారు. రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చామని, సన్న వడ్లు పండించే రైతులకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించిన ఆయన, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విప్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.57 వేల కోట్లు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు మంజూరు చేసినట్లు తెలిపారు. సకాలంలో వడ్డీ చెల్లించిన మహిళా సంఘ సభ్యులకు మూడు సార్లు వడ్డీ రాయితీ అందించామని వెల్లడించారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జనగణన శిక్షణపై అదనపు కలెక్టర్ దృష్టి

మేడిపల్లి, ప్రభాతవార్త :



మేడిపల్లి మండల కేంద్రంలో గురువారం రోజున జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని వాసుదేవ, సురభి, సూర్య రైస్ మిల్లులను ఆమె సందర్శించారు. రబీ 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీలు పెండింగ్ లేకుండా సమయానికి బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశించారు.అనంతరం రాబోయే జనగణన- 2027 నిర్వహణపై ఏర్పాటైన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు క్రమపద్ధతిలో, తప్పులు లేకుండా జనగణన ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. డేటా నమోదు విధానం, గోప్యత పరిరక్షణ, ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారులు, మేడిపల్లి ఎమ్మార్వో, ఎంపీడీవోతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని జువ్వాడి కృష్ణా రావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజి రెడ్డి , వైస్ చైర్మన్ పుల్లూరి వెంకటేష్, మండల కాంగ్రెస్ నాయకులు కొంతం రాజంలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టినేని లతా రమేష్,ఉప సర్పంచ్ జంగా స్వామి, వార్డు సభ్యులు తర్ర సునీత, రామగిరి శ్రీధర్, చిట్నేనీ శైలజ, సంకే స్రవంతి, గజం గంగాధర్, చిట్నేని జగన్, వనతడుపుల పెద్ది రాజు , పంచాయతీ కార్యదర్శి సరిత గ్రామ అధికారులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఓదెల రామకృష్ణ తనిఖీ చేపట్టారు. వేసవి దృష్ట్యా ఉపాధి శ్రామికులు ఉదయాన్నే పనులకు వచ్చి ఎండ కాకముందే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని, పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ,షేడ్ నెట్ , త్రాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి రాణి, ఉప సర్పంచ్ బాసవేని రమేష్, పల్లి రాజు, లింగంపల్లి ప్రణీత్,పంచాయతీ కార్యదర్శి యం.పృథ్వి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్



మేడిపల్లి, ప్రభాతవార్త :

వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి చల్మెడలక్ష్మి నరస్నిహారావు జన్మదిన సందర్భంగా శివాలయం ఆలయంలో పూజలు నిర్వహించారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో తొంబరావుపేట గ్రామ శివాలయం లోవారి పేరు మీద అర్చన జరిపించి, ఆలయ ప్రగాణంలో ఏక బిల్వం మొక్క నాటడం జరిగింది. ఆలయ ప్రధాన పూజారి రమేష్ పంతులు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జిల్లా అధ్యక్షులు గోపి సలహాదారు మజిద, కట్లకుంట తొంబరువుపేట బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

భీమారం, ప్రభాతవార్త :



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐదవ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల విద్యా ప్రయాణానికి గుర్తుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విజయాలను తల్లిదండ్రులతో కలిసి ఆనందంగా పంచుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించడం అందరినీ ఆకట్టుకుంది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు సభను మరింత రంగరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ వేడుకలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోరుట్ల వార్త

## ఘనంగా చల్మెడ పుట్టినరోజు వేడుకలు



కథలాపూర్ ప్రభాతవార్త.

భారత రాష్ట్ర సమితి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు 64వ పుట్టినరోజు వేడుకలు బి.ఆర్.ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. హాజరైన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి. ఏర్పాటు చేసిన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల నాయకులు మామిడిపల్లి రవి. గడ్డం భూమారెడ్డి. కల్లెడ శంకర్. వర్ధిని నాగేశ్వరరావు. కిరణ్ రావు. బాలు. మహేందర్ రెడ్డి. ఎంజిరెడ్డి మేడిపల్లి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చదువే బంగారు భవిష్యత్తుకు బాటలు

కథలాపూర్ ప్రభాతవార్త



భారతీయ జనతా యువమోర్చా మండల అధ్యక్షులు ఆరే శివ కుమార్ ఆధ్వర్యంలో కథలాపూర్ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారంతో సన్మానించారు . భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరరావు. మండల అధ్యక్షులు మల్యాల మారుతి. యువమోర్చా మండల అధ్యక్షులు ఆరే శివకుమార్ మాట్లాడుతూ చదువే బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని. కష్టపడి చదివి తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని తెలిపారు.కష్టపడి చదివే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యం,కల్లెడ ప్రసాద్,నారాయణ,బొమ్మ మధు,యువమోర్చా నాయకులు కాసోజీ ప్రతాప్,సునీల్,అనిల్ రెడ్డి, వెంకటేష్,కిషోర్,శ్రీకర్,అనుదీప్,గణేష్,నవీన్,అఖిల్, ప్రకాష్, అధ్యాపకులు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాస్ట్రో పాఠశాలల సంస్థకు నేషనల్ విన్నర్ అవార్డు

కథలాపూర్ ప్రభాతవార్త



కథలాపూర్ మాస్ట్రో పాఠశాలల సంస్థకు నేషనల్ విన్నర్ అవార్డు వచ్చినట్లు పాఠశాల చైర్మన్ ఆకుల రాజేష్ తెలిపారు. హైదరాబాదులో హోటల్ నోవాటెల్ లో జరిగిన నేషనల్ లెవెల్ శిక్ష అవార్డులలో భాగంగా. స్థానిక కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థలైన మాస్ట్రో పాఠశాలకు. నేషనల్ విన్నర్ అవార్డు వచ్చినట్లు ఆయన తెలిపారు. లీడ్ సంస్థ సి ఈ ఓ అమిత్ మిశ్రా చేతుల మీదుగా నేషనల్ విన్నర్ అవార్డును పాఠశాల చైర్మన్ ఆకుల రాజేష్ ప్రిన్సిపల్ ఆకుల రంజిత్.లు అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాస్ట్రో పాఠశాలలకు నేషనల్ అవార్డు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, పోషకులు అభినందనలు తెలిపారు

# ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది

## -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. “ప్రజా పాలనప్రగతి ప్రణాళిక“ కార్యక్రమం సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ మండలం, డ్యాంగాపూర్ ప్రభుత్వ బాలుర ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ కు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి కలెక్టర్, అధికారులు, పోషకులు కలిసి పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. పోషకులు, తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల వల్లనే పాఠశాల ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రగతి వివరాలు కూడా ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులకు తెలుస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలవడం వల్ల పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు అందరూ సెలవులు ముగియగానే సమయానికి పాఠశాలకు రావాలని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నీటి సౌకర్యానికై బోరు వేస్తామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు అన్ని నైపుణ్యాలు, అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లలందరూ చదువులు, ఆటల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన, క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్ లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

# విరాట్ హిందూ సమ్మేళనం కోసం భారీ బైక్ ర్యాలీ

**ఎన్టీపీసీ ప్రభాతవార్త:**



జైశ్రీరామ్ నినాదాలతో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్టిపిసి పరిధిలోని కృష్ణా నగరంలో హిందూ ఐక్యతకు నాంది పలికే కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈనెల 25వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల నుండి స్థానిక లక్ష్మీ నరసింహ గార్డెన్ ప్రాంగణంలో జరగబోయే విరాట్ హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలనే ఉద్దేశంతో గురువారం సాయంత్రం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మేడిపల్లి సెంటర్‌లోని చిలకలయ్య గుడి నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, పట్టణంలోని ప్రధాన పురవీధుల మీదుగా ఘనంగా కొనసాగింది. హిందుత్వ భావజాలాన్ని బలోపేతం చేయడం, ప్రతి బస్తీ-ప్రతి గ్రామం-ప్రతి కాలనీలో హిందూ బంధువులను ఐక్యం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో యువతీ యువకులను హిందూ సంస్కృతి వైపు ఆకర్షించే విధంగా ప్రసంగాలు, భక్తి కీర్తనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీలో హిందూ విరాట్ సమ్మేళనం బాధ్యులు వల్లాల సురేష్, మార్చిడి మహేందర్ గౌడ్, నల్లి నరేష్, సంకట రవి గౌడ్, నారాయణరాణే, రంగారావు, రాంపల్లి శ్రీనివాస్, కోట కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు హాజరై ర్యాలీని విజయవంతం చేశారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## -జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నెపల్లి మండల తహసిల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాలలో నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న లతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వా నబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు

## -జిల్లెల్లపల్లి సర్పంచ్ గడ్డం రాజేశం

## -జిల్లెల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్



**ముత్తారం, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు ఉంటాయని సర్పంచ్ గడ్డం రాజేశం అన్నారు. ముత్తారం మండలంలోని జిల్లెల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం పేరెంట్స్ మీటింగ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ గడ్డం రాజేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం రాజేశం ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని, వారి హాజరును, ప్రవర్తనను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యార్థుల అవసరాల గురించి తల్లిదండ్రులు, ఉ సర్పంచ్‌తో చర్చించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను సర్పంచ్ గడ్డం రాజేశం చేతుల మీదుగా తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశం, ఉపసర్పంచ్ జన్నే శ్రీవాణి ప్రవీణ్‌తోపాటు వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల రవాణపై కఠిన చర్యలు

## -జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**



నకిలీ, నిషేధిత విత్తనాల రవాణా, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డిఎస్పిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వానాకాలం దృష్ట్యా విత్తన సరఫరా, నిల్వలు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, విత్తన దుకాణాలు, గోదాములను తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినా, సరైన అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని, ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల రవాణాపై నిఘా ఉంచాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి నకిలీ విత్తనాల గుర్తింపు, రసీదు స్వీకరణ ప్రాముఖ్యతపై రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణ కొరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నకిలీ విత్తనాలను పూర్తిస్థాయిలో నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేసి అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని తెలిపారు. అనంతరం ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల ప్రకారం ఇసుక త్రవ్వకం, రవాణా పారదర్శకంగా సాగేందుకు ఆన్ లైన్ వ్యవస్థను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేయాలని, ఇసుక రవాణా పూర్తిగా ఆన్ లైన్ బుకింగ్ ద్వారా మాత్రమే జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆలయ అభివృద్ధికి రూ.1,00,016 విరాళం

**వేములవాడ, ప్రభాతవార్త:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం, ఆలయ అభివృద్ధికి, విస్తరణకై హైదరాబాద్ హెచ్ఎంటి చింతల్‌కు చెందిన నీలారపు పద్మజ శివకుమార్ దంపతులు రూ.1,00,016 విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం ఆలయ ఏఈఓ టి.శ్రవణ్ కుమార్‌కు ఈ విరాళాన్ని అందించారు. విరాళం అందించిన నీలారపు పద్మజ శివకుమార్ దంపతులకు ఈ సందర్భంగా ఏఈఓ ఆలయ లడ్డూ ప్రసాదాన్ని అందించారు.

# మూడపల్లిలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

**చందుర్తి ప్రభాతవార్త:**

చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి, గ్రామంలో ప్రతి వర్షాకాలం లో లెవెల్ బ్రిడ్జి నీటిలో మునిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో స్థానిక సర్పంచి, గ్రామస్తులు విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా బ్రిడ్జి నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేశారు, ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేయగా గురువారం నుండి పనులు ప్రారంభమయ్యాయి, గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో గ్రామ సర్పంచి చిలుక మల్లేశ్వరి అంజిబాబు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదు

## బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్వరూప వేణుగోపాల్



**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :** మెట్‌పల్లి మున్సిపాలిటీలో కోఆప్షన్ ఎన్నికల నోటీసుల జారీపై వివాదం రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. తాజాగా వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్ ఘాటుగా స్పందించారు. ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, వైస్ చైర్మన్ చట్టంపై పూర్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారా... లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారా...! అన్నది అర్థం కావడం లేదని విమర్శించారు. మున్సిపల్ నోటీసులపై కమిషనర్ సంతకం లేకపోవడం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. చట్టంలోని కొన్ని సెక్షన్లను మాత్రమే ప్రస్తావిస్తూ, మిగతా కీలక నిబంధనలను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టి ప్రెస్ మీట్ నిర్వహించడం ప్రజలను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా, మొదట జారీ చేసిన నోటీసులను జిల్లా కలెక్టర్ రద్దు చేయించిన విషయంపై వైస్ చైర్మన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా ఉంటే ఆ నోటీసులను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అలాగే, మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 62 ప్రకారం ఏ అధికారిక నోటీసుపైనా మున్సిపల్ కమిషనర్ సంతకం తప్పనిసరి అని ఆమె గుర్తు చేశారు. కమిషనర్ సంతకం లేకుండా జారీ చేసిన నోటీసులను ఏ చట్టం అంగీకరిస్తుందో స్పష్టం చేయాలని వైస్ చైర్మన్‌ను ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయం ప్రభుత్వ వ్యవస్థనా, లేక ఒక పార్టీ కార్యాలయమా..?అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ఎన్నికలపై న్యాయపరమైన సమస్యలు వస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. కోఆప్షన్ ఎన్నికల నిబంధనల ప్రకారం కనీసం మూడు స్పష్టమైన రోజులు ముందుగా నోటీసులు ఇవ్వాలని ఉన్నప్పటికీ, ఆ నిబంధనను ఉల్లంఘించి హడావిడిగా ఎన్నికలు నిర్వహించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అనర్హులను లబ్ధి చేకూర్చేందుకే ఈ తొందరపాటు జరుగుతోందా అని సందేహం వ్యక్తం చేశారు. స్క్రూటీనీలో కొందరిని అనర్హులుగా తేల్చినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, పూర్తి వివరాలను కమిషనర్ అధికారికంగా వెల్లడించాలని ఆమె డిమాండ్ చేశారు. చట్టాన్ని అమలు చేయాలని కోరడం వ్యక్తిగత కక్ష కాదు. అధికారులు, పాలకులు కలిసి చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ధర్మపురి స్వరూప వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి కౌన్సిలర్లు బొడ్ల రమేష్, బొడ్ల ఆనంద్, నాయకులు కోయల్ కార్ లింగేశ్వర్ ఆరిగెల రాకేష్ తదితరులు ఉన్నారు

# ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు

### కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.



**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు ఉంటుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు.పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులను ఎమ్మెల్యే సంజయ్ గురువారం కలిసి వారి ధర్నాలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పూర్తిగా న్యాయమైనవని,ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి,కానీ చేతలు మాత్రం గడప కూడా దాటడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి జీవో గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేశామని,కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింట్మెంట్ ఇస్తే ఆ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. జీవో గెజెట్ ఇచ్చి కూడా అపాయింట్మెంట్ ఇవ్వడానికి ముఖ్యమంత్రి వద్ద సమయం లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించిన ఆయన,నిరసనలు వ్యక్తం చేస్తున్న కార్మికులపై కేసులు నమోదు చేయడం,ధర్నా చేస్తున్న వారికి కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయనివ్వకపోవడం అన్యాయమని అన్నారు.ఎండ భారీ నుండి రక్షణకు కార్మికులకు గొడుగులను ఎమ్మెల్యే అందచేయగా..ఆర్టీసీ కార్మికులకు 100 న్యాయం జరిగే వరకు తాను వారి పక్షాన పోరాటం కొనసాగిస్తానని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఆర్టీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్ల జాప్యంపై ఎమ్మెల్యే మండిపాటు

**ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :**

ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్ల జాప్యంపై కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. మండల కేంద్రంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.మక్కలు కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ సరైన విధంగా కొనుగోలు జరగకపోవడంతో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు మార్కెట్లో సరిపడా స్థలం లేకపోవడం వల్ల నిల్వలో ఉన్న మొక్కలను కొనుగోలు చేయడంలో ఆలస్యం జరుగుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇంచు స్థలం కూడా లేకపోవడంతో రైతులతో పంటను విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికీ కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరలకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ సమయంలో వర్షాలు పడితే రైతులకు మరింత నష్టం వాటిల్లిందని ఆరోపించారు. అట్లాగే వరి ధాన్యం కొనుగోలు కూడా మార్కెట్లో సరిపడా సదుపాయాలు లేవని రైతులకు ఆశ చూపించి చివరికి వెన్నుపోటు పొడుస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా మండిపడ్డారు. రైతుబంధు సకాలంలో అందడం లేదని, యూరియా కొడతా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుబంధు సకాలంలో అందించడమే కాకుండా ఎరువుల కొరత లేకుండా చూశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలేచి వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతుల న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట తహసిల్దార్ వరప్రసాద్, సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్ రెడ్డి, నిర్వాహకులు రాజేందర్, మాజీ కోఆప్షన్ చిన్న రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.





# మెట్‌పల్లి వార్త

## మెట్‌పల్లి మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ధర్మపురి స్వరూప నియామకం



**మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:** మెట్‌పల్లి మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ధర్మపురి స్వరూపను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్ర రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కౌన్సిల్‌లో పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు భాగంగా ఈ నియామకాలు చేపట్టినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనూప్ రావ్, జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ స్థాయిలో ఇతర పదవులను కూడా భర్తీ చేశారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా బొడ్ల ఆనంద్, పార్టీ విప్‌గా దొనికెల శిరీషనవీన్, ఫ్లోర్ కార్యదర్శిగా పుడుకారం దివ్యలను నియమించారు. నియామక పత్రాలును రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనుప్ రావ్, జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబులు గురువారం అందజేశారు. కాగా నూతనంగా నియమితులైన నేతలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ అభిప్రాయాలను బలంగా వినిపించేందుకు అలాగే ప్రజా సమస్యలను కౌన్సిల్ ముందుకు తీసుకువెళ్లే దిశగా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ నియామకాల సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు ధర్మపురి స్వరూపతో పాటు ఇతర బాధ్యతలు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. నా నియామకానికి కృషి చేసిన ఎంపీ అరవింద్ కు కృతజ్ఞతలు ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూనూతన ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప మాట్లాడుతూ, పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో నా ఈ నియమకానికి కృషి చేసిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## మెట్‌పల్లిని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

### కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ లింబాద్రి

### 47 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



**మెట్‌పల్లి డివిజన్ ప్రభాతవార్త:** మెట్‌పల్లి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు మొత్తం 47 అంశాలను ఎజెండాలో పొందుపరిచారు. కౌన్సిల్ సభ్యులు వాటికి చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశం సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పట్టణంలోని ప్రస్తుత సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డుల్లో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, వీధి దీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని కోరారు. వీధి కుక్కలు, కోతుల సమస్యపై కూడా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించిన అన్ని సమస్యలపై దృష్టి సారించి దశలవారీగా త్వరితగతిన పరిష్కారం చేస్తామని తెలిపారు. పట్టణాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. స్పందన, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి, టీపీఓ రాజేంద్రప్రసాద్, ఆర్ఓ మిర్జా అజ్మతుల్లా బేగ్, జేఏఓ రమేష్ తదితర అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిరిసిల్ల వార్త



## సిరిసిల్లలో అకాల గాలివాన బీభత్సం

**స్తంభించిన జనజీవనం గాల్లోకి ఎగిరిన ఇనుప రేకులు, నేలకూలిన భారీ వృక్షాలు అంధకారంలో పలు కాలనీలు, నిలిచిపోయిన రాకపోకలు**

**యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిన అధికారులు**

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అకాల గాలివాన భీభత్సం సృష్టించింది. అకస్మాత్తుగా వాతావరణం మారిపోయి, బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం విరుచుకుపడటంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రచండ గాలుల ధాటికి సిరిసిల్ల పట్టణంలో పలుచోట్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. గాలుల ఉధృతికి పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న భారీ కటౌట్లు, గేట్లు, ఫ్లెక్సీలు కొట్టుకొచ్చి ఎక్కడికక్కడ రోడ్ల మధ్యలో పడిపోయాయి. పలుచోట్ల భారీ వృక్షాలు సైతం సమూలంగా నేలకూలగా, మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ముఖ్యంగా సిరిసిల్ల బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గాలివాన ధాటికి ఇనుప పెద్ద రేకులు గాల్లోకి ఎగిరి రహదారిపై పడటంతో వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో వాహనాల రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. రహదారులపై అడ్డంగా భారీ వృక్షాలు, రేకులు పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు, విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తెగిపడటంతో పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పరిస్థితిని గమనించిన విపత్తు నిర్వహణ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తక్షణమే అప్రమత్తమయ్యారు. హుటాహుటిన సంఘటనా స్థలాలకు చేరుకుని, రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్లను, శిథిలాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. అకస్మాత్తుగా విరుచుకుపడిన ఈ గాలివానతో స్థానిక వ్యాపారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు



## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ తలారి రాణి



ముస్తాబాద్ ప్రభాత వార్త:

ముస్తాబాద్ మండలం రామీరెడ్డిపల్లె ఐకేపీ ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామసర్పంచ్ ఎరవెల్లి లక్ష్మి ,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారిరాణి చేతుల మీదుగా వడ్లకొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమములోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, తహసిల్దార్ మహ్మద్ అబ్దుల్ ఫారూఖ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రఘు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెల్ముల రామిరెడ్డి, డైరెక్టర్ క్యారం రాజు, మాజీ సెస్ డైరెక్టర్ విజయ రామారావు, ముస్తాబాద్ ఉపసర్పంచ్ తాళ్ళ విజయ్ రెడ్డి, ఏపీఎం రాజనర్సు, సీసీలు శ్రీను, సెంటర్ నిర్వాహకురాలు స్వప్న, తదితరులు పాల్గొన్నారు

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

**రైతులు సన్నరకం వడ్లు సాగు చేయాలి.**

తంగళ్లపల్లి, ప్రభాతవార్త.

. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందుతుందని జిల్లా క లెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కల్పించిన వసతులను పరిశీలించారు. ఎంత ధాన్యం వస్తుందని, గన్నీ బ్యాగ్స్ పై నిర్వాహకులను ఆరా తీశారు. ధాన్యం తేమ శాతం పరిశీలించారు. హమాలీలు ఎందరు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో అన్ని వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్ తో శుభ్రం చేయించాలని సూచించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కేటాయించిన మిల్లులకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రానున్న సీజన్ లో రైతులు సన్నరకం వడ్ల సాగు చేయాలని పిలుపు నిచ్చారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, సర్పంచ్ గుండు ప్రేమ్, ఏపీఎం, ఏవో తదితరులు పాల్గొన్నారు



## శ్రీ భగీరథ మహర్షికి జిల్లా కలెక్టర్ ఘన నివాళి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :



శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శ్రీ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, కుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఈదురుగాలుల బీభత్సం

**గోడకూలి ఆరుగురికి తీవ్ర గాయాలు**

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. అకస్మాత్తుగా వీచిన బలమైన గాలుల ధాటికి స్థానిక గాంధీ నగర్‌లో ఓ గోడ కుప్పకూలడంతో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భీకరమైన ఈదురుగాలులు వీచాయి. ఈ క్రమంలో గాంధీ నగర్ ప్రాంతంలో ఓ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ అక్కడే ఉన్న ఆరుగురు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు వారిని శిథిలాల కింద నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం వారిని హుటాహుటిన కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మిగతా వారు స్థానికంగానే చికిత్స పొందుతున్నారు. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గాంధీ నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

తంగళ్ళపల్లి, ప్రభాతవార్త



. తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలని గ్రామ ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ గడ్డం రచన మధుకర్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఉదయం పూటనే ఉపాధి పనులు ముగించుకోవాలని కూలీలకు సూచించారు.

## అంగన్వాడీ స్థల దాతకు ఎమ్మెల్యే సన్మానం



ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని వల్లంపట్ల గ్రామములో నిర్మించబోయే అంగన్ వాడి భవన నిర్మాణం కోసం స్థల దానం చేసిన కట్ల సౌమ్య శ్రీకాంత్ రెడ్డి ని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం సన్మానించారు. క్యాంపు కార్యాలయములో సన్మానం చేశారు. అంతే కాకుండా మహిళా సంఘ భవనానికి కూడా గతములో స్థల దానం చేసిన సౌమ్య శ్రీకాంత్ రెడ్డి లు గ్రామానికి ఆదర్శ ప్రాయులు అని ఎమ్మెల్యే కొనియాడారు. అదేవిదంగా గ్రామానికి చెందిన వార్డు సభ్యులు మందాల నరేందర్, కర్ల సులోచన, ఎర్రవెల్లి వెన్నెలతో పాటు గ్రామ యువకుడు కర్ల అరుణ్ ను ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ నేరళ్ళ విజయ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, అనిల్, జీడి కంటి అశోక్, ఎరుకల తిరుపతి పాల్గొన్నారు

## గాలివానకు ఇంటిపై కూలిన చెట్టు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములో గురువారం కురిసిన గాలి వాన రైతులకు నష్టాన్ని కలిగించింది. చిక్కుడు వానిపల్లె గ్రామానికి చెందిన పెండ్యాల కనుకయ్య ఇంటిపై చెట్టు కూలింది. అంతే కాకుండా విపరీతమైన గాలి వల్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు పడి పోవడముతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరపోసిన వరి ధాన్యం అకాల వర్షానికి తడిసి పోయింది. అంతేకాకుండా కోతకు ఉన్న వరి పంట కూడా గాలి వానకు నష్టం జరిగినట్లు రైతులు వాపోయారు.

# రైతు సంక్షేమమే మా లక్ష్యం దళారులను నమ్మి మోసపోవద్దు

## - కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జగిత్యాలరూరల్ ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జగిత్యాల మండలం రూరల్ చల్గల్ వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం వారి గ్రామాలకు సమీపంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా దళారుల బెడద లేకుండా మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో పాక్స్ ఆధ్వర్యంలో 67, సెర్ప్ ద్వారా 37, మెప్మా ఆధ్వర్యంలో ఒక కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఖిరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నిత్యం నూతన సాగు పద్ధతులను నేర్చుకుంటూ సాంకేతికత వైపు మొగ్గు చూపినప్పుడే స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా సన్న బియ్యం పంపిణీ పథకం నేపథ్యంలో సన్న వడ్ల సాగుకు మంచి భవిష్యత్తు ఉందని, సన్న రకం పండించే రైతులకు ప్రభుత్వం క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తోందని గుర్తు చేశారు. దొడ్డు రకం వడ్లకు మద్దతు ధర ఉన్నప్పటికీ మార్కెట్‌లో డిమాండ్



తగ్గుతున్నందున, రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కటింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో రైతులు కూడా నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఆరబోసి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే రెండో విడత రైతు నిధులను మంజూరు చేసిందని, రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, డీసీఓ మనోజ్, డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ హాకిం, డీఎంఓ ప్రకాష్, సెక్రటరీ శ్రీనివాస్ రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్ రెడ్డి, సర్పంచుల ఫోరమ్ ప్రతినిధులు గంగారెడ్డి, కట్ట రాజేందర్, ఏఎంసీ డైరెక్టర్లు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అంశంలో కాంగ్రెస్‌కు హైకోర్టు షాక్

## -బీఆర్ఎస్ నేతల హర్షం..

## -ఘోష్ కమిషన్ నివేదిక నిలుపుదలపై సంబరాలు

**కొడిమ్యాల, ప్రభాతవార్త:**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గురువారం భారత రాష్ట్ర సమితి మండల శాఖ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, ఈ నేపథ్యంలో ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆశీస్సులతో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రులు నిజాయితీతో బయటపడతారని పేర్కొన్నారు. నిజం ఆలస్యమైనా గెలుస్తుందనే విషయం ఈ తీర్పుతో స్పష్టమైందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, శోభమ్మ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని



పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి, మండల యువజన అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు అబ్దుల్ షకూర్, మాజీ రైతుబంధు అధ్యక్షులు అంకం రాజేశం, మాజీ ఎంపీటీసీ సభ్యులు సురుగు శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, మాజీ సర్పంచ్ మల్యాల మహిపాల్, కొండాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెల్ల లక్ష్మణ్, హిమ్మత్ రావు పేట గ్రామ శాఖ అధ్యక్షులు ఆకునూరి మల్లయ్య , యువ నాయకులు రాచకొండ చంద్రమోహన్, నేరెళ్ల రాజయ్య, రామంచ లక్ష్మణ్, మోహన్, గణేష్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే..

## -విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అక్షర ఉన్నత పాఠశాల

## -పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి

**బీర్ పూర్ ప్రభాత వార్త:**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని అక్షర ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. విద్యాబుద్ధులతో పాటు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో అగ్రగామిగా నిలుస్తున్న ఈ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పైడి మారుతి మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత ప్రస్థానానికి పునాది గాఖిఅక్షరఖి పాఠశాల పనిచేస్తుందని పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే అనేది కేవలం ఒక తరగతి పూర్తి చేయడం కాదని, అది విద్యార్థుల జీవితంలో ఒక ఉన్నతమైన ప్రయాణానికి ఆరంభమని పేర్కొన్నారు. అక్షర పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని, డాక్టర్లు, ఇంజనీర్లుగా మరియు వివిధ రంగాల్లో రాణిస్తూ పాఠశాల పేరును నిలబెడుతున్నారని ఆయన గర్వంగా తెలిపారు.



కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. కొల్వాయి గ్రామంలోని ఈ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీ పడకుండా పనిచేస్తోంది. ఆధునిక బోధనా పద్ధతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మరియు విద్యార్థుల పట్ల కరస్పాండెంట్ మారుతి గారికి ఉన్న అంకితభావం కారణంగానే అక్షర హై స్కూల్ నేడు మండలంలోనే అత్యుత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు అక్షర హై స్కూల్ విద్యా ప్రమాణాలకు నిలువుటద్దం అని తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభా పాటవాలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. తమ పిల్లలను ఇంత గొప్పగా తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యాన్ని, కరస్పాండెంట్ మారుతి గారిని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# జగిత్యాల వార్త



## ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్

**జగిత్యాల రూరల్ ప్రభాతవార్త:**



జగిత్యాల మండలం రూరల్ పోరండ్ల గ్రామంలో గురువారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శోభమ్మ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ దంపతులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. అనంతరం వెల్దుర్తి గ్రామంలోని గట్టు మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు, మాజీ పాక్స్ చైర్మన్లు సదా శివ రావు, మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, గొల్లపల్లి సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు కొండల్ రెడ్డి, మహేష్, లింగన్న, హరీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామాల్లో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ఎమ్మెల్యేని కలిసి ధన్యవాదాలు తెలిపిన జగిత్యాల వైశ్య సంఘం సభ్యులు

**జగిత్యాల అర్బన్ ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతి నీ అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేయగా గౌరవ ముఖ్యమంత్రి గారికి, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్‌ని కలిసి ధన్యవాదాలు తెలిపిన వైశ్య సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి బోడ్ల జగదీష్, కోశాధికారి శ్రీనివాస్ ఆలయ ఛైర్మెన్ రాజేందర్, చంద్రకాంత్, సతీష్, కోటగిరి సంజయ్, చందు ,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అదనపు ఎస్పి చేతన్ నితిన్



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చేతన్ నితిన్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌ని గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

## జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ బాధ్యతలు స్వీకరణ

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**




జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ నీ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేయడం జరిగింది. చేతన్ నితిన్ ఐపిఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పి గా విధులు నిర్వర్తించారు.

## మే డే వారోత్సవాలను జయప్రదం చేయాలని

## సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ...

జమ్మికుంటటౌన్ ప్రభాత వార్త:

మే డే వారోత్సవాలు జయప్రదం చేయాలని జమ్మికుంట మండల కేంద్రంలో గురువారం రోజున ట్రాన్స్పోర్ట్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, 1886లో చికాగో నగరంలో మరణించిన అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాయని,140 సంవత్సరాల క్రితం శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, పనిగంటల తగ్గింపు కోసం, వీరోచిత పోరాటం నిర్వహించిన కార్మిక వర్గ ఆత్మార్పణతో ఏర్పడిన ఎర్రజెండా, కార్మిక వర్గానికి పీడిత ప్రజలకు అనేక హక్కులను సాధించి పెట్టిందని, భవిష్యత్ కార్మిక పోరాటాలకు బాసటగా నిలుస్తుందని తెలిపారు. పాలక దోపిడి ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా నిలిచేది, దోపిడీ లేని సమాజం ఏర్పాటు కోసం, సమ సమాజ స్థాపనకు ఎర్రజెండా ఒక్కటే దిక్సూచి అని అన్నారు. మే డే సందర్భంగా పల్లె పల్లెనా ఎర్రజెండా ఎగురవేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పి కొట్టాలని,కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాల సవరణను, పని గంటల పెంపును, పెట్టుబడుదారి, బడా పారిశ్రామిక, అనుకూల విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని, కులం ప్రాంతం మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ బిజెపి రాజకీయ లబ్ధి పొందుతుందని, ఆరోపించారు. రోజురోజుకు ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి, కార్మికులకు ఉద్యోగ భద్రత లేక, కనీస వేతనాలు అందుబాటు, సమాన పనికి సమాన వేతనం, పర్మినెంట్ పనిలో పర్మెంటు ఉద్యోగుల నియమించకుండా, కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్, వివిధ స్కీముల పేరుతో కార్మికులతో పని చేయించుకుని యదేచ్ఛగా ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని, దీని ద్వారా దేశ అభివృద్ధికి ఆటంకంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని తెలిపారు. కేంద్రం తీసుకొస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతుందని, దానిలో భాగంగానే పని గంటల పెంపు రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిందని, రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కనీస వేతనాలు అమలు చేస్తాం కాంట్రాక్ట్ చేస్తామని చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క కార్మిక వర్గ సమస్య పరిష్కారం చేయలేదని, కార్మికులు సమ్మెలు పోరాటాలు చేస్తే పోలీస్ నిర్బంధాలను ఉపయోగిస్తుందని, ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జక్కుల రమేష్ యాదవ్, కార్మికులు మధునయ్య, పోచయ్య,చల్ల ప్రభాకర్, కిరణ్, ప్రవీణ్, మల్లేష్, సాయి, రాకేష్ సది పాల్గొన్నారు.



## గూడూరు చెరువులో ఉపాధి హామీ

## పూడిక తీత పనులు ప్రారంభం

కమలాపూర్; ప్రభాత వార్త

కమలాపూర్ మండలం గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సర్పంచ్ వనజ కళాధర్ లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని చెరువులో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామస్తులు, ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పూడికతో నిండిపోయిన చెరువుకు మళ్లీ జీవం పోసేందుకు ఈ పనులు దోహదపడతాయని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వనజ కళాధర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామాలకు వరం లాంటిదని అన్నారు. చెరువులో పూడిక తీయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, దీంతో చుట్టుపక్కల పొలాలకు సాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. వర్షాకాలంలో వృథాగా పోయే వాననీటిని ఒడిసిపట్టి రైతులకు మేలు చేయడమే లక్ష్యమని చెప్పారు. చెరువు బాగుపడితే ఊరంతా బాగుపడుతుందని, పశువులకు తాగునీరు, పంటలకు సాగునీరు అందుతుందని గుర్తు చేశారు. పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకుని భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు.ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. పని దినాలు పెంచుకుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని, వలసలు ఆపి సొంత ఊర్లోనే పని కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సమయానికి హాజరై సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పనుల ద్వారా గ్రామ అభివృద్ధితో పాటు వందలాది మంది కూలీలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మక్క, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పనులను పారదర్శకంగా నిర్వహించాలని, కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్కు సర్పంచ్ సూచించారు. గ్రామంలో మరిన్ని ఉపాధి హామీ పనులు చేపట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.



## నాలుగు జిల్లాల చెత్తతో హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా..?

## బిజెపి ఎమ్మెల్సీ అంజి రెడ్డి

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సిర్సపల్లి శివారులో 125 ఎకరాలలో నాలుగు జిల్లాలకు సంబంధించిన చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడానికి యార్డు ఏర్పాటు చేస్తే , చుట్టుపక్క గ్రామాలు, హుజురాబాద్ ప్రజలకు, ఈ ప్రాంత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని, ప్రభుత్వం నాలుగు జిల్లాల చెత్తతో ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా అని బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. గురువారం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి డంపింగ్ యార్డ్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం తమకు తోచినట్టు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. నాలుగు జిల్లాల చెత్తను తీసుకొచ్చి ఒక్క ప్రాంతంలో వేస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్లు ఎలా జీవిస్తారు..? వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుల పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో మొండిగా నిర్ణయం తీసుకొని ఇక్కడి ప్రాంతంలో యార్డ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం భావ్యం కాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ, కీడు, హాని తలపెట్టే కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ ప్రాంత ప్రజలను బాధ పెడుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలను సృష్టించడం సరికాదన్నారు.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామనే ప్రకటన, నిర్ణయంతో హుజూరాబాద్ ప్రాంతంలో నెల రోజులుగా గందరగోళ పరిస్థితులు వచ్చాయన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని నెల రోజులుగా ప్రజలు ఆందోళలు నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొండి వైఖరి తోనే ఉండడం సరికాదన్నారు.. ప్రజలంతా ఒక్కటై, అన్ని పార్టీలు ,అన్ని సంఘాలు ఒక్కటై జేఏసీగా ఏర్పడి ముక్తకంఠంతో నినదించిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని మార్చుకొని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన తక్షణమే చేయాలన్నారు. విత్తన కేంద్రంగా ఉన్న ఈ హుజురాబాద్ ఏరియాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి హుజూరాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, పారిపెల్లి కొండాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్స్ మొలుగురి సుమలత, పంజాల మనోజ్, దామర అనూష, తూర్పాటి లక్ష్మీ దుర్గకొండ ప్రశాంతి, కందుగుల గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్, బిజెపి సీనియర్ నాయకులు పైల్ల వెంకట్ రెడ్డి, గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, నరాల రాజశేఖర్, తిప్పబత్తిని రాజు, యాంశాని శశిధర్, సబ్బని రమేష్, అనురాగ్, మంచికట్ల మురళి, పడారి సుమన్, గంట సంపత్, కొలిపాక వెంకటేష్, ఇనుగొండ తిరుపతిరెడ్డి, వెంకట్రావు, బైరెడి సంపత్ రెడ్డి, సహదేవ్ క్యాస వెంకటేష్, ఎర్ర శ్రీధర్, నల్ల అజయ్, పద్దం విజయ్, నగేష్ లతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హుజూరాబాద్ వార్త

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన గ్రామ సర్పంచ్.. గడ్డి శ్రీనివాస్..

ఇల్లందుకుంట, ప్రభాతవార్త:




ఇల్లందుకుంట మండలం గడ్డివానిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గడ్డి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు మీరు పండించిన వరి ధాన్యమును గ్రామాల్లో తక్కువ ధరలకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు గ్రేడ్ – ఏ రకానికి ధర 2,389 రూపాయలకు అమ్ముకోవాలని, రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చి మీ యొక్క ధాన్యమును అమ్ముకోవాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున అధికారులకు సూచనలిస్తూ రైతులకు బార్దాన్ సంచులు, అందుబాటులో ఉంచుతూ కాంటాలు తొందరగా అయ్యే విధముగా చూసుకోవాలన్నారు. ఆకాల వర్షం వచ్చినప్పుడు రైతులకు టార్పలిన్స్ ఇవ్వాలని, తేమ సాకుతో మిల్లుల వద్ద కోతలు, తరుగు పెడితే వెంటనే మా దృష్టికి తీసుకవస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో ఐకేపీ అధికారులు స్వామి, జనార్ధన్, వార్డు సభ్యులు, రైతుసోదరులు పలువురు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి క్లాస్మేట్స్ ఆర్థిక సహాయం.

వీణవంక, ప్రభాత వార్త:

వీణ వంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన దాసారపు వినోద్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. గురువారం కుటుంబ సభ్యుల ద్వారా సమాచారమందుకొన్న మృతుని పదవ, ఇంటర్,డిగ్రీ క్లాస్మేట్స్ తాళ్ళపెల్లి కుమార స్వామి,అభిషేక్ ,అజయ్,రాకేష్, అనిల్,సాగర్, యాసిన్ తో పాటు తదితరులు మృతుని ఇంటికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన మృతినీ నాన్న,సోదరుడు మూడు సంవత్సరాల క్రితం చనిపోయారు.ఇప్పుడు ఇతని మృతితో అతని భార్య ,తల్లి కి తీరని లోటు ఏర్పడిందని భావించిన క్లాస్మేట్స్ 70,300 లను ఆర్థిక సహాయం అందిస్తూ ,ఆ సొమ్మును మృతుని కుమార్తె పేరట చదువుల కోసం ఖాతా లో జమ చేయాలను కుటుంబ సభ్యుల ను కోరారు. రాజ కీయ నాయకులు సంక్షేమ పథకాలను ఆ కుటుంబానికి అందించాలని,ఎవ్వరైనా దాతలు ఆర్థిక సహాయం చేయాలనుకొనే వారు ఈ సెల్ నెంబర్ కు 77023 48954 ఫోన్ పే చేయాలని కోరారు.



# దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి

-పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ పల్లె శాంతిరాజు

-రిజర్వేషన్ హోదా కల్పించాలంటూ డిమాండ్



గోదావరిఖని, ప్రభాతవార్త:

దళిత క్రైస్తవులకు సామాజిక న్యాయం చేయాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ పల్లె శాంతిరాజు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్ హోదా లేకపోవడం వల్ల దళిత క్రైస్తవులు విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. రంగనాథ మిశ్రా కమిషన్, సచార్ కమిటీ, సతీష్ దేశ్‌పాండే కమిటీలు కూడా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. సిక్కు, బౌద్ధ మతాల వారికి ఎస్సీ హోదా కల్పించిన ప్రభుత్వం, దళిత క్రైస్తవులను ఎందుకు విస్మరిస్తోందని ప్రశ్నించారు. గ్రామాల్లో భూస్థాపన సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత క్రైస్తవ హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న సికింద్రాబాద్‌లో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, పాస్టర్లు అభిషేక్ పాల్, శీను పాల్, జాన్ వెస్లీ, థామస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్ష సాధింపు చర్యలకు హైకోర్టు తీర్పు గట్టి హెచ్చరిక

బీ.ఆర్.ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం



పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

రాజకీయ కక్ష సాధింపు చర్యలకు హైకోర్టు తీర్పు గట్టి హెచ్చరిక అని బీ.ఆర్.ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘోష్ కమిషన్ పై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, ఈ తీర్పు ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం బహిర్గతం అయిందని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గౌరవ హైకోర్టు కమిషన్ నివేదిక సహజ న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు మరియు ఎంక్వైరీ యాక్ట్1952కు విరుద్ధంగా ఉందని స్పష్టంగా పేర్కొనడం ద్వారా కమిషన్ ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలు బయటపడ్డాయని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కక్ష సాధింపుతోనే తప్పుడు ఆరోపణలు చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను అపకీర్తి పరచాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచిందని, మూడు బ్యారేజీలు, అనేక రిజర్వాయర్లు, లిఫ్ట్ వ్యవస్థలతో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగి ఉందని వివరించారు. హైదరాబాద్ కు త్రాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరాలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కేవలం మేడిగడ్డ బాలాజీ లోని 2 పిల్లర్ల లోని కొన్ని సాంకేతిక లోపాలను చూపిస్తూ మొత్తం ప్రాజెక్టును తప్పుబట్టడం సరికాదని, ఒకవైపు కూలేశ్వరం అని విమర్శలు చేయడం మరోవైపు దానిని పునరుద్ధరిస్తామని చెప్పడం ప్రభుత్వ వైఖరిలో ఉన్న విరుద్ధతను చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తప్పుడు ప్రచారాన్ని మానుకుని, కాళేశ్వరం ప్రాజెక్టును త్వరితగతిన మరమ్మతులు చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ రఘువీర్ సింగ్, ఉప్పు రాజ్ కుమార్, వెన్నం రవీందర్ సుజాత, వంగల తిరుపతిరెడ్డి, నునేటి సంపత్, తానిపర్తి మోహన్ రావు, సందీప్ రావు, బైరెడ్డి రాంరెడ్డి, బోయిని రాజమల్లు, సలేంద్ర రాములు, పోల్ రాజు కనకమ్మ, శ్రీనివాస్, బోయిన్ శీను, ఒజ్జ సంపత్, గుణపతి, ముత్యాల రాజయ్య, మల్లారం నారాయణ, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, కిషోర్ పాల్గొన్నారు.

# శానిటేషన్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

మరణించిన కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దపల్లి, ప్రభాతవార్త:



శానిటేషన్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత 35 సంవత్సరాలుగా పెద్దపల్లి మేజర్ గ్రామపంచాయతీ నుండి నేటి మున్సిపల్ కేంద్రం అయ్యే వరకు శానిటేషన్ కార్మికునిగా సేవలందించిన రెడ్డిమల్ల రాజేశం అనారోగ్య కారణాలతో మరణించగా, గురువారం దినకర్మ సందర్భంగా వారి స్వగ్రామం పాలితంలో వారి కుటుంబాన్ని మున్సిపల్ నూగిల్ల మల్లయ్య పరామర్శించారు. కార్మికుడు రాజేశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి సొంతంగా రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపల్ శానిటేషన్ కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో చూపే శ్రమ అభినందనీయమని అన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం మానవ ధర్మమని, అటువంటి కార్మికులకు, వారి కుటుంబాలకు ఎల్లవేళలా తోడుంటామని తెలిపారు. ఇక నుండి పెద్దపల్లిలో పనిచేసే మున్సిపల్ కార్మికుడు ఎవరు చనిపోయినా తన వంతు సహాయంగా 5000 రూపాయలు అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే వ్యాఖ్యలపై సుల్తానాబాద్‌లో బీజేపీ నిరసన



**సుల్తానాబాద్, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని ఖండించారు. ప్రజల ఆశీర్వాదంతో దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధానిని అవమానించడం అంటే ప్రజా తీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. అభివృద్ధి అంశాల్లో పోటీ పడలేక కాంగ్రెస్ వ్యక్తిగత విమర్శలకు దిగజారిందని ఆరోపించారు. ఖర్గే తన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ప్రజల్లో మరింత వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీకి చెందిన పలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ వివాహానికి యువకుల చేయూత

సుల్తానాబాద్, ప్రభాతవార్త:

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఐతరాజుపల్లి గ్రామ యువకులు సహాయ హస్తం అందించారు. గ్రామానికి చెందిన కొత్తూరి మానస వివాహం సందర్భంగా నిర్వహించిన వరపూజ కార్యక్రమంలో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక యువనాయకులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వైకే ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్ది సాయికిషోర్ గౌడ్ భోజన ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఐతరాజుపల్లి బీజేపీ సీనియర్ నాయకులు ఎర్రం సంతోష్ రెడ్డి 25 కిలోల బియ్యాన్ని అందించి తమ సహకారం తెలియజేశారు. సహాయం అందించిన వారికి కొత్తూరి మనోజ్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తూరి సత్యనారాయణ, మీయపురం రాంమోహన్, ఈర్ల అమరేందర్, పిట్టల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






# పెద్దపల్లి గడ్డపై బహుజన జెండా ఎగురవేస్తాం

ఏ.ఐ.ఎఫ్.బీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి గడ్డపై బహుజన జెండా ఎగురవేస్తాం అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ మెహరాజ్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరగా, గురువారం పెద్దపల్లిలో ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది బహుజన రాజ్యమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకమై బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. బహుజనులందరిని ఏకం చేసి, వారి ఆశీర్వాదంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా బరిలో ఉంటానని తెలిపారు. బహుజన బిడ్డనైనా తనను దీవించి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, గులాం ఖాజా పాషా, కుక్క కనకరాజు, బొంకూరి నరేందర్, కుక్క అశోక్, ఇరుగురాల రాజు, కుక్క శ్రీనాథ్, వడ్డేపల్లి తిరుమల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు

-కాసులపల్లి సర్పంచ్ గద్దల రాజశేఖర్

-అంగన్వాడీ సెంటర్ లో గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దడమే మనందరి లక్ష్యం అని కాసులపల్లి సర్పంచ్ గద్దల రాజశేఖర్ అన్నారు. గురువారం పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్దల రాజశేఖర్ హాజరై మాట్లాడారు. గర్భిణీ స్త్రీలు పోషకాహార విలువలు గల ఆహారం తీసుకోవాలని, చిన్నారులకు పౌష్టికాహారం తినిపించాలని సూచించారు. చిన్నతనం నుండే పిల్లల ఆరోగ్యం, విద్య పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లులు మరియు గర్భిణీలు పాల్గొన్నారు.

# 25న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బేస్ బాల్ పోటీలు

-బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు

-గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహణ



**పెద్దపల్లి, ప్రభాతవార్త:** ఈ నెల 25న జిల్లా స్థాయి సబ్ జూనియర్ బేస్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు, కోచ్ బిందు తెలిపారు. పెద్దపల్లి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల బేస్ బాల్ పోటీలు ఈ నెల 25వ తేదీ శనివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో జరగనున్నాయని తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఈ పోటీలకు 11 2011 నుండి 31.12.2013 మధ్య జన్మించిన బాల, బాలికలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి 7వ బెటాలియన్ క్రీడా మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

## కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కాంగ్రెసుకు బుద్ధిరావాలి : ఎమ్మెల్యే సంజయ్ కుమార్



కోరుట్ల, ప్రభాతవార్త :=

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్కు బుద్ధిరావాలని, కాళేశ్వరం కమీషన్పై హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఘోష్ కమీషన్ పేరిట మూడేళ్లుగా కేసీఆర్పై కక్షగట్టి రాజకీయాలు చేసిన సీఎం రేవంత్రెడ్డికి హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. పీసీ ఘోష్ కమీషన్ కాదని పీసీసీ నివేదిక అని బీఆర్ఎస్ పార్టీ చెప్పిందే నిజమైందని హైకోర్టు తీర్పుతో తేటతెల్లమైందని, కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, బరాజ్లు, ఎన్నో కాలువలు, సొరంగాలు, పంప్ హౌజ్ల సమూహారాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద కుంగిన పిల్లర్లకు సొంత ఖర్చులతో మరమ్మత్తు చేసేందుకు నిర్మాణ సంస్థ ఎల్అండ్ టీ ముందుకు వచ్చిందని, మూడు, నాలుగు వందల కోట్లు వెచ్చిస్తామని ఒప్పుకున్నా బెదిరించి పారిపోయేటట్లు చేశారని ఆరోపించారు. కాళేశ్వరం బాగుపడితే కేసీఆర్కు పేరు వస్తుందని సీఎం రేవంత్రెడ్డి కుట్రలకు తెరలేపాడని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రూ. లక్ష కోట్లు నీళ్ల పాలయ్యాయని నోటి కొచ్చినట్లు మాట్లాడిన కాంగ్రెస్ నాయకులకు మళ్లీ కాళేశ్వరం ప్రాజెక్టే దిక్కయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. గోదావరి నుంచి వృధాగా పోతున్న నది జలాలను ఒడిసిపట్టి బరాజ్లను నిర్మించి వందల టీఎంసీల నీటిని కాపాడారని, నిండు ఎండకాలంలోను రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా కేవలం మేడిగడ్డ బారజ్ వద్ద టీఎంసీ నీళ్లు పారుతున్నాయన్నారు. కాళేశ్వరమే రాష్ట్రానికి ప్రాణాధారమని తెలంగాణకు త్రాగునీరు, లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అద్భుతమైన ప్రాజెక్టు అని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని కుంగిన రెండు ఫిల్లర్లకు వెంటనే మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు వహీం, కౌన్సిలర్లు మోసీన్, సురేందర్, మహేష్, నాయకులు మదు, నరేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల సీఐగా లక్ష్మినారాయణ

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల సీఐగా లక్ష్మీనారాయణ నియమిస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో కోరుట్ల సీఐగా పని చేసిన సురేష్ బాబు బదిలీపై మెట్పల్లికి వెళ్లగా, జగిత్యాల సిసిఎస్ లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ కోరుట్ల కు బదిలీ అయ్యాడు.

## పలు కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త :



కోరుట్ల మండలంలోని ధర్మారం, అయిలాపూర్, సర్పరాజ్ పూర్, పైడిమడుగు, మదాపూర్ గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటను రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులకు లాభం చేకూర్చడమే ఈ కొనుగోలు కేంద్రాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసమని , రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో రైతులకు భరోసా కల్పించిందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మల్యాల/ ప్రభాతవార్త

మల్యాల మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీలకు గురువారం గ్రామ సర్పంచ్ గడ్డం నడిపి నడిపి మల్లేశం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు, ఉపాధి పనుల్లో పాల్గొంటు కూలీ లకు ఎండ దెబ్బ తగలకుండా మజ్జిగ ప్యాకెట్లను అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు, అంతేకాకుండా గ్రామంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెడుతున్న రైతులకు కూడా ఈ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు అందించి ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారికి సూచించారు

## బీజేవైఎం అధ్యక్షునిగా పొనగంటి గౌతం నియామకం

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలంలో బిజెపి అనుబంధ సంస్థల కమిటీలను జిల్లా అధ్యక్షుడు ఆమోదం మేరకు నియమించారు, ఈ మేరకు మల్యాల మండ్నల ముత్యంపేట గ్రామానికి చెందిన యువ నాయకుడు పొనగంటి గౌతమ్ ను మండల బీజేవైఎం అధ్యక్షునిగా నియమించారు, ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జిల్లా బిజెపి ఉప అధ్యక్షుడు బింగి వేణు, మండల అధ్యక్షులు మల్లేశం లు గౌతమ్ కు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు,

## రైతు సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మల్యాల/ ప్రభాతవార్త

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని, గడచిన రెండేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ నిధులను రైతు భరోసా రైతు బంధు ఇన్పుట్ సబ్సిడీలతో రైతన్న సంక్షేమానికి అమలు చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు, గురువారం మల్యాల మండలం మానాలలో తక్కల్లపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ తో కలిసి ప్రారంభించారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా సంక్షేమానికి పాటుపడుతుందని , రైతులు పండించిన పంటను దళారులకు దరిచేరకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేస్తుందని, ఆలస్యం లేకుండా చెల్లింపులు జరుపుతున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్ పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ రామ్ లింగ రెడ్డి, మానాల సర్పంచ్ బలమూరి పాపారావు, ముత్యంపేట, నూక పల్లి ,సర్వాపూర్, గుడి పేట సర్పంచులు ఆదిరెడ్డి శ్రీనివాస్ హనుమంతు, శ్వేత అంజిరెడ్డి, నాయకులు మేక లక్ష్మణ్ ,నక్క అనిల్ ,ఉప సర్పంచ్ తిరుపతి, మరాఠీ బుచ్చిరెడ్డి, శంకర్ గౌడ్, ముత్తయ్య, గంగాధర్, శ్రవణ్, హరినాథ్, తక్కలపల్లి సింగిల్ విండో సీఈవో మనోజ్ కుమార్, ఏ ఈ ఓ మంజుల పాల్గొన్నారు,

# చొప్పదండి వార్త




## అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ వెంకట్

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి శ్రీ స్వామి వారి ని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికారులు వారికి స్వాగతం పలికి అనంతరం శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఎమ్మెల్సీకి ఆలయ ఈవో అంజన రెడ్డి లడ్డు ప్రసాదాలు అందించి శాలవా తో సన్మానించారు, కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ చంద్రశేఖర్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అర్చకులు పాల్గొన్నారు

## శ్రీరామ మందిర నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

మల్యాల/ ప్రభాతవార్త



బైపాస్ రోడ్డు మార్గంలో శ్రీరామ మందిర నిర్మాణానికి కమిటీ సభ్యులు విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు, గురువారం మల్యాల మండల కేంద్రంలో చెందిన కొప్పుల సుధాకర్ పుష్పలత, సతీష్ లు రూ,1,00,116 విరాళాన్ని అందజేశారు, ఆలయ నిర్మాణానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ సభ్యులు అభినందించారు,

## రాజకీయ కక్ష సాధింపు కోసమే కాళేశ్వరం పడావు

చొప్పదండి,ప్రభాతవార

:రెండున్నర ఏళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి కైన తెలంగాణ రైతులకు క్షమాపణలు చెప్పి,ప్రాజెక్టు పిల్లర్ల పనులు పూర్తి చేసి రైతుల పక్షాన నిలవాలని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని సంపత్ డిమాండ్ చేశారు. గురువారం చొప్పదండి లో విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్ట్ ఇచ్చిన తీర్పు ను బిఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ తీర్పు ఒక చెంప పెట్టు అన్నారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఎవరు వ్యవహరించిన దేశంలోనీ న్యాయస్థానాలు ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువు అయ్యిందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికైనా అనవసర కాలయాపన చేయకుండా, తక్షణమే కుంగిన రెండు పిల్లలను సరి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని సంపత్ డిమాండ్ చేశారు.

## మహిళా సాధికారతకు మోడీ ప్రభుత్వం కృషి

చొప్పదండి,ప్రభాతవార్త

:దేశంలో మోడీ ప్రభుత్వం మహిళా సాధికారతకై కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ పేర్కొన్నారు. గురువారం మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో చొప్పదండి మున్సిపల్ 3వార్డు బీజేపీ కౌన్సిలర్ చిల్ల అర్చన మగ శిశువుకు జన్మనిచ్చిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, బొడిగె శోభ ఆసుపత్రికి వెళ్లి తల్లి, శిశువును పరామర్శించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొడిగె శోభ మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ పార్టీ దేశవ్యాప్తంగా మహిళల సాధికారత, మాతాశిశు సంక్షేమానికి విశేష ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ప్రజా సేవలో ముందుండే మహిళా ప్రజాప్రతినిధులు కుటుంబ బాధ్యతలతో పాటు సమాజానికి సేవ చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

## -మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి

చందుర్తి ప్రభాత వార్త:

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర లభిస్తుందని,రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు, చందుర్తి మండలంలో మర్రి గడ్డ, కిష్టంపేట, లింగంపేట, జోగాపూర్, ఎన్గల్, కట్ట లింగంపేట గ్రామా లలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రా లను చేలకల తిరుపతి గురువారం ప్రారంభించారు, ఈ సంద౯ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నట్లు ఆయన తెలిపారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ



మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతుల సంక్షే మాన్ని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తూ మద్దతు ధర ఇస్తున్నారన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగం కుమార్ సర్పంచ్‌లు దూది మనిషా శ్రీనివాసరెడ్డి, అసనిపర్తి శోభారాణి, మోకనపల్లి దేవరాజు, కొక్కుల నరేష్, అవారి రమేష్ నాయకులు బాణాల రవీందర్ రెడ్డి, ఇందూరి మధు, అమర బండ సాయి, గంట మల్లేశం, సంతపురి బాలు ఐకెపి ఎపిఎం కళ్యాణి,రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా చల్మెడ జన్మదిన వేడుకలు

రుద్రంగి ప్రభాతవార్త :



రుద్రంగి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దెగవత్ తిరుపతి, ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మాట్లాడుతూ,సుమారు 20 ఏళ్ల క్రితం వైద్య కళాశాల స్థాపించి వేలాది నిరుపేద కుటుంబాలకు లక్షలాది అభాగ్యులకు వైద్యం అందించి చల్మెడ ఆరోగ్య ప్రదాత అయ్యాడని అన్నారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి స్వామి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో పాటు సుఖ సంతోషాలు శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంకించారు.ఉద్యమ నేత కేసీఆర్ బాటలో నడుస్తున్న చల్మెనాయకత్వంలో పని చేయడం సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మానాల సర్పంచ్ బుర్ర శంకర్,మాజీ ఎంపిపి గంగం స్వరూప మహేష్, గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్,వార్డు మెంబర్లు ఉప్పులూటీ గణేష్,చేప్యాల గణేష్,కంటే రెడ్డి,నగులపెల్లి రవీందర్,కోడిగంటి శ్యామ్,గొళ్ళెం నర్సింగ్,దయ్యాల నారాయణ,మంచే రాజేశం,దయ్యాల పెద్దులు,సింగరపు గంగారెడ్డి,బోయిని చంద్రయ్య,ఏనుగుల రాజు,అంబటి రాములు,బొడ్డు మల్లేశం,ఎల్లాల గంగారెడ్డి,గసికంటి కొండయ్య,నరేష్,మోహన్,నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చల్మెడ జన్మదిన వేడుకలు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జి చల్మెడ నరసింహారావు 64 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సర్పంచ్ కుంటెల్లి నాగరాజు తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో సర్పంచ్ నాగరాజు కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు వంగాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మమత మహేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ కాదాస్ అంజయ్య, మాజీ సింగిల్విండో వైస్ చైర్మన్ మహేష్, వార్డు సభ్యులు ప్రణీత భూమేష్ గౌడ్,జమున పర్శరాములు,బాబు,మండల ఉపాధ్యక్షులు మహేష్,సుమన్,నాగరాజు,నర్సయ్య, పర్శరాములు, అన్వేష్,రవి,ఎ ల్లయ్య, గణేష్,శ్రీనివాస్,బద్రి,యాకుబ్, కాంతయ్య,మల్లేశం, గంగయ్య,శ్రీనివాస్,సంజీవ్, మల్లయ్య,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణా ఏర్పాట్లు పరిశీలన

రుద్రంగి ప్రభాత వార్త:

రుద్రంగి మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి నేడు శంఖుస్థాపన చేయనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ గురువారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ చేతులమీదుగా ఈ శంఖు స్థాపన కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ రమేష్, ఎస్సై లు మోతీరాం, రమేష్, యాదగిరి, పోలీస్ హౌసింగ్ బోర్డు ఏఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



# హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

## మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని ప్రభాతవార్త :** కాలేశ్వరం ప్రాజెక్టు పైన హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టుగా నిలుస్తుందని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు కళ్లు తెరువాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. గురువారం మంథని పట్టణంలోని రాజగృహాలో హైకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పు తర్వాత పీసీ ఘోష్ కమీషన్ రిపోర్ట్ పీసీసీ స్ట్రిఫ్‌గా నిర్థారించబడిందని అన్నారు. రేవంత్‌రెడ్డి గొంతుపెద్దగా ఉందని అబద్దాలు ఆడుడు మానేసి పరిపాలనపై దృష్టి పెట్లాలని ఆయన డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా అడ్డూఅదుపు లేకుండా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టు తీర్పుతోనైనా కళ్లు తెరువాలని ఆయన అన్నారు. 150 కిలోమీటర్ల విస్తీర్ణంలో నియోజకవర్గంలోనే నీళ్లు నిలబడి ఉంటున్న ఇంత పెద్ద ప్రాజెక్టుతో పశ్చిమ తూర్పు గోదావరిని తలపించే విధంగా ఈ ప్రాంతం మారుతున్న క్రమంలో ఇద్దరు రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు అధికారంలోకి వచ్చి కళ్లలో కారం పోసుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు తమ్మడిహేట్టి వద్ద ప్రాజెక్టు కడితే బాగుంటదని మాట్లాడిన నాయకులు మూడేళ్లయినా ప్రతిపాదన చేయలేదని తట్టెడు మట్టి తీయలేదన్నారు. తమ్మిడిహేట్టి నుంచి మేడిగడ్డకు కేసీఆర్ ఒకరి ఆలోచన కాదని, క్యాబినెట్ నిర్ణయంతో పాటు ఇంజనీరింగ్ నిపుణుల కమిటి లోతైన అధ్యయనం చేసి రిపోర్ట్ ఇచ్చిన తర్వాతనే కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద బ్యారేజీ మొదలు పెట్టిందని హైకోర్టు తేల్చి చెప్పిందని, ఈ విషయంలో ఇకనైనా అజ్ఞానులకు జ్ఞానం రావాలని ఆయన కోరుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న దుష్ప్రచారంపై హైకోర్టు కుడా మందలించిందని, కేసీఆర్ అనుమతి లేకుండా ఆయనను అబాసుపాలు చేసేలా దుష్ప్రచారం చేయడం చట్ట విరుద్ధమని, కేసీఆర్, హరీష్‌రావుతో పాటు ఆనాడు పని చేసిన అధికారులను బదనాం చేయడం కూడా చట్ట విరుద్ధమని హైకోర్టు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయిందని బదనాం చేసినోళ్లు ఈనాడు మేడిగడ్డకు కాన్వాయ్‌తో బ్యారేజ్‌మీద నుంచి పోయి పగుళ్లను చూసి వచ్చి మళ్లీ సభలో మేడిగడ్డ కూలిపోయిందని అనడం హస్యాస్పదన్నారు. మూడు సార్లు బారీ వర్షాలు, లక్ష క్యూసెక్కుల వరద నీటి తట్టుకుని నిలబడ్డదని, కుంగిపోయింది కానీ ఇంత పెద్ద వరదలు వచ్చినా ఇంచు కదలలేదని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్దరించి రైతులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూపాలపల్లి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ జక్కు శ్రీ హర్షిని తో పాటు పలువురు బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.






# ఉపాధి కార్మికులకు మజ్జిగ, అరటి పండ్లు,ఓఆర్ఎస్ పంపిణీ

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజిపేట గ్రామంలో రోజ్‌గార్ దివాస్‌ను పురస్కరించుకుని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను గ్రామ ప్రజాప్రతినిధులు సందర్శించి పరిశీలించారు. ఎండ తీవ్రతలో పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి మజ్జిగ, అరటి పండ్లు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.సర్పంచ్ జంకె మధు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనులు గ్రామ అభివృద్ధికి కీలకమని, ఈ పనుల్లో పాల్గొనే కార్మికుల ఆరోగ్యం కాపాడటం తమ బాధ్యత అని తెలిపారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయాలని కార్మికులకు సూచించారు.గ్రామంలో కొనసాగుతున్న చెక్‌డ్యామ్, మట్టి పనులు, శుభ్రత కార్యక్రమాలను పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉప్పుల సాగర్, కోడం రవి, సంకసాల రాజేష్ రాజేష్, పెద్దపల్లి మనోజ్, జంకె సత్తయ్య, పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, ఆశ వర్కర్లు ప్రవళిక, గౌతమి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటి కల సాకారం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఎదురుగట్ల గ్రామంలో నరెట్ల అనురాధ గృహప్రవేశంతో పాటు, లింగంపల్లి సహా మరికొన్ని గ్రామాల్లో లబ్ధిదారులు కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో పూజలు నిర్వహించి కొత్త ఇళ్లలోకి ప్రవేశించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వస్త్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రజా పరిపాలనలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని ఆయన తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద కుటుంబానికి స్వంత గృహం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేయడం ప్రత్యేకతగా నిలుస్తోందని తెలిపారు. గృహప్రవేశ వేళ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా ఎదురుగట్ల గ్రామ సర్పంచ్ కదారి సంధ్య తిరుపతి, మాజీ సర్పంచ్ సోయినేని లహరి కర్నాకర్, రూరల్ మండల అధ్యక్షుడు వకులాబరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఉత్సవ వాతావరణంలో జరిగింది. కొత్త ఇంటిలో సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని అందరూ ఆకాంక్షి ంచారు.



# విద్యార్థులు మారుతున్న సాంకేతిక అభివృద్ధిని పునికి పుచ్చుకొని ముందుకెళ్లాలి

## -అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధిపతి శ్రీనివాస్ రెడ్డి



**రామగిరి ప్రభాతవార్త:**

వేగంగా మారుతున్న సాంకేతికాభివృద్ధిని పుణికిపుచుకోవాలని, నిత్యం అప్డేట్ అవుతూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలని బసంత్ నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ అధిపతి మందల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంథని జేఎన్టియు ఇంజనీరింగ్ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవం గురువారం ప్రిన్స్ పాల్ బి విష్ణువర్ధన్ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రసంగించారు. విదార్థుల్లో కొరవడిన సామాజిక స్పృహను అధ్యాపకులు బాధ్యతగా తీసుకొని పెంచాలన్నారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. నిత్యం ఏదో ఒక ఆటను ఆడడం దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ క్రీడలకు అన్ని సౌకర్యాలు ఉన్నా విద్యార్థుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడం బాధకరమన్నారు. క్రీడలకు కావాల్సిన సౌకర్యాలు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సెల్ ఫోన్లు మానేసి క్రీడలపై మమకారం పెంచుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఛాంపియన్లుగా ఫైనలియర్ మెకానికల్ ఎల్ సత్యసాయి, సిఎస్ఇ మైత్రిలు నిలిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం ఉదయ్కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, జి సునీల్ కుమార్, టీచింగ్, నాన్టీచింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలు తిరస్కరించిన నాయకుడివి ప్రజా నాయకుడిని విమర్శించడమా

-ప్రజాక్షేత్రంలో తరిమికొడతాం

-కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



**మంథని ప్రభాతవార్త:**

ప్రజ ప్రజాక్షేత్రంలో తిరస్కరించ బడిన పుట్ట మధు ప్రజలు ఐదుసార్లు అక్కున చేసుకున్న ప్రజానాయకుడు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును విమర్శించడం సిగ్గుచేటని మంథని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తన రాజకీయ ఉనికిని చాటుకోవడం కోసమే మధు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారిని తక్కువ చేసి మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కెసిఆర్ వల్లే శ్రీధర్ బాబు మంత్రి అయ్యారని మాట్లాడటం హాస్యాస్పదం. అసలు సోనియా గాంధీ గారు తెలంగాణ ఇస్తేనే నువ్వు ఎమ్మెల్యే వయ్యావు, మీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు అన్న సత్యాన్ని మర్చిపోవద్దు అని నాయకులు గుర్తు చేశారు. శ్రీధర్ బాబు ఉమ్మడి రాష్ట్రంలోనే మంత్రిగా పనిచేశారని, ఇప్పుడు కూడా ప్రభుత్వంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని స్పష్టం చేశారు.నస్తురుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా సభ విజయవంతం కావడం, సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా శ్రీధర్ బాబు సలహాలు, సూచనలను కొనియాడటం చూసి పుట్ట మధు తట్టుకోలేక పోతున్నారని నాయకులు ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో శ్రీధర్ బాబు కి వచ్చే మంచి పేరును అడ్డుకోవాలని కుట్రతోనే ఇలాంటి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు మాటలు మాట్లాడే పుట్ట మధును ప్రజా క్షేత్రంలో తరిమికొడతామని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినా పుట్ట మధుకు బుద్ధి రాలేదని, ఇకనైనా పిచ్చి మాటలు మానుకోకపోతే నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జంట హత్యల కేసులో ఇరుక్కొని అజ్ఞాతంలోకి వెళ్ళిన చరిత్ర ఉన్న వ్యక్తికి శ్రీధర్ బాబు ని విమర్శించే నైతిక హక్కు లేదని తేల్చి చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాజీ పాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

నాగారం సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి



**మంథని రూరల్ ప్రభాతవార్త :** ప్రభుత్వం రైతులకు అందుబాటులో మద్దతు ధర ఇస్తూ ఏర్పాటు చేసిన వారి ధాన్య కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని నాగారం గ్రామ సర్పంచ్ శ్రీదేవి సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారంమంథని మండలం నాగారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ఆదేశాల మేరకు నాగారం గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేందుకు ప్రభుత్వం గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందిస్తుందని తెలిపారు, రైతులు మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించుకునేలా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ , ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మార్కెట్ వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ సత్యనారాయణ రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ లు రాం రాజశేఖర్, మద్దెల చంటయ్య, మంథని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, నాగారం ఉప సర్పంచ్ ఎరుకల లలిత, నాగారం మాజీ ఉప సర్పంచ్ బెల్లంకొండ భాస్కర్ రెడ్డి, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

## -సర్పంచ్ మెంగని సమత తిరుపతి

హరిపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**ముత్తారం, ప్రభాతవార్త:** దళారులను నమ్మి మోసపోవద్దు అని హరిపురం సర్పంచ్ మెంగని సమత తిరుపతి పేర్కొన్నారు. ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మెంగని సమత తిరుపతి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వైస్ చైర్మన్ మద్దెల రాజయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెంగని సమత తిరుపతి మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలని, కొనుగోలు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజీద్ పాషా, యూత్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్, ఉపసర్పంచ్ కూస తిరుపతి, వార్డు సభ్యులు ఏజ్జ లత తిరుపతి, అడ్డూరి మోహన్, రామంచ స్వరూప రాజేష్, ఏగుర్ల జ్యోతి రాజు, చెనవేన సాయి కుమార్, యారా సునిత రాజిరెడ్డి, ఐకేపీ సిబ్బంది ఎల్లమ్మ తిరుపతి, రైతులు, హమాలీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మంథని వార్త

# పది గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మంథని రూరల్ ప్రభాతవార్త:**



మంథని మండలంలోని పది గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. మండలంలోని పుట్టపాక, అక్కేపల్లి, నగరంపల్లి, మహబూబ్ పల్లి, మల్లేపల్లి, పోతారం, నాగారం, కన్నాల, గుంజపడుగు, సిరిపురం వరి ధాన్యం కేంద్రాలను సర్పంచులు కన్నూరి రాజబాపు, పెయ్యల సంధ్య, నాతరి లత, లక్కాకుల సత్యనారాయణ, ఎడ్ల ఆదిత్య, బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ రెడ్డి, గుడిసె గట్టయ్య, దండవేన సంధ్య, గోదారి లక్ష్మీలు ప్రారంభించారు. రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్కుమార్, ఏ ఏం సి వైస్ చైర్మన్ ముస్కుల ప్రశాంత్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతులు, ప్రజాప్రతినిధులు, హమాలీ సంఘం నాయకులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

-కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి



**ముత్తారం, ప్రభాతవార్త:** ముత్తారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.శ్రీధర్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పనా, సంజీవయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.శ్రీధర్‌ను సన్మానించారు. అనంతరం ప్రిన్సిపల్ జి.శ్రీధర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యాబోధనలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా సిబ్బందితో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోండి

-సర్పంచ్ మంతెన చంటి

**రామగిరి ప్రభాతవార్త** రైతులు తమ పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ మంతెన చంటి అన్నారు. గురువారం రామగిరి మండలం బేగం పేట గ్రామపంచాయతీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందేల రేణుక కుమార్ స్వామి వార్డు సభ్యులు ప్రశాంత్, సౌందర్య, సంజీవ్, సతీష్, శ్రీనివాస్, కిరణ్, రైతులు హమాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## -మంత్రి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, ప్రభాతవార్త :



రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం లో బుధవారం ఇస్రాజ్‌పల్లి లో , గురువారం చెందోలి లో ప్రాథమిక సహకార కేంద్రం ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు మద్దతు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో 'తప్ప తాలు' పేరుతో క్వింటాల్‌కు 4-5 కిలోల వరకు కోతలు విధించేవారని విమర్శించారు. దళారుల దోపిడీ లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా కొనుగోలు కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని మాజీ ఉప సర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్ నివాసంలో తేనీరు సేవించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను మంత్రికి వివరించగా, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, తహసిల్దార్ ఎండి మస్జిద్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దాసరి తిరుపతి గౌడ్, సర్పంచులు జక్కుల పావని దస్తగిరి, బుర్ర సంధ్యారాణి భూమయ్య, మేడిపల్లి రాంరెడ్డి, ఈర్నాల విజయ రాజేశ్వర్, కాసారపు భవాని అరవింద్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు కొక్కుల జలంధర్, అత్తన శివయ్య, మాజీ సర్పంచులు చిర్ర గంగాధర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు సాన రవీందర్, బైరం రవీందర్, ఒర్పుల లచ్చన్న, వార్డు సభ్యులు జాలిగామ లతా నరేష్, యూత్ నాయకులు శ్రీరాముల హరీష్, అంబటి రాజశేఖర్, అరె శ్రీకాంత్, సిద్ధుల బాలయ్య, రైతులు బైరం ఐలయ్య, శ్రీరాముల మల్లయ్య, సొసైటీ సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలి

## -ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్

పెగడపల్లి, ప్రభాతవార్త:

రానున్న 141వ మేడే ఉత్సవాలను పెగడపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మే డే ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయడానికి కార్మిక వర్గం మరో వీరోచిత పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, మండల అధ్యక్షుడు రాచర్ల సురేష్, నాయకులు ఆత్మకూరి రాజేష్, సుంకే ప్రకాష్, పాలమాకుల కుమార్,



శ్రీరామ్ పోచయ్య, బాస్కె శ్రీను, సిగిరి రాజ్ కుమార్, మల్లారపు సురేష్, ఆరేల్లి రాజు, కొత్తూరి చందు, కొల్లిపాక స్వామి, నంబాల కిషన్, మహంకాళి ఆకాష్, గంగాధర బాబు, గంగాధర మల్లేశం, తోడేటి కనకయ్య పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

ధర్మపురి, ప్రభాతవార్త:



వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య అన్నారు. ఐకెపి ఆధ్వర్యంలో మండలంలోని నక్కల పేట, నాగారం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామల సర్పంచ్ లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు నల్ల మల్లవ్వ, చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, ఐకెపి ఎపిఎం ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈదుర గాలులకు విరిగిన వేప చెట్టు

### విద్యుత్ తీగలపై పడడంతో విరిగిన స్తంభాలు

**ధర్మపురి, ప్రభాతవార్త:** ధర్మపురి మండలంలో గురువారం వీచిన ఈదర గాలులతో మండలంలోని గాదెపల్లి గ్రామంలో వేప చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. సాయంత్రం వేళలో గాలి తీవ్రతకు చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడి పోయింది. ఆ సమయంలో సంఘటన స్థలం సమీపాన స్థానికులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫ రాను నిలిపివేశారు.



## వెంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

గొల్లపల్లి, ప్రభాతవార్త:



ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని బి.బి.రాజుపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల వివాహం జరిగిన సందర్భంగా సతి సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. పూజలు అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామి తమ కులదైవమని, స్వామివారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో బి బి రాజ్ పల్లి సర్పంచ్ ఓరగంటి తిరుపతి వార్డ్ సభ్యులు తోట్ల శ్రీనివాస్, పెద్ది సాంబయ్య, జెట్టి రమేష్, మాలోత్ జగన్, ఉప్పు శ్రీను ,కోమిరే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మే డే పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడ పట్టణ మున్సి పల్ కార్యాలయం ముందు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1వ తేదీన మేడే కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న మేడే కార్యక్రమాన్ని కార్మికులందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సరిపల్లి నరేష్, నాయకులు గుడిసె మల్లేశం, కుమ్మరి రాము, కీసర శ్రీనివాస్, సిహెచ్.అనిల్, బొట్టు శ్రీనివాస్, సావనపల్లి శ్రీనివాస్, 20 మంది కార్మికులున్నారు.

# ధర్మపురి వార్త

## జిల్లా పంచాయతీ అధికారులపై మండిపడ్డ సమాచార కమీషన్

### -పరిహారం కోరిన సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి

బుగ్గారం ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులపై మండిపడ్డట్లు సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జారీ చేసిన 18 ఆర్డర్ లకు జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులు సమాచారం ఇవ్వడంలో పూర్తిగా విఫలం అయ్యారని ఆయన వివరించారు. అందులో నాలుగు కేసులకు మొదటి ఆర్డర్ తో అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో కమీషన్ రెండో సారి కూడా ఆర్డర్ లు జారీ చేశారన్నారు. అయినా నేటి వరకు పంచాయతీ అధికారులు సమాచారం ఇవ్వక పోవడంతో బుధవారం జరిగిన విచారణలో సమాచార కమీషన్ జిల్లా పంచాయతీ అధికారులపై తీవ్రంగా మండిపడినట్లు ఆయన తెలిపారు. గత ఆరేండ్లుగా పంచాయతీ అధికారులు సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించారని, వారి విధులను, బాధ్యతలను దుర్వినియోగం చేశారని, కమీషన్ ఆర్డర్ లను కూడా బేఖాతర్ చేశారని చుక్క గంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ దృష్టికి వ్రాత పూర్వకంగా తీసుకు వెళ్ళి తనకు పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో సమాచారం ఇవ్వనందున పరిహారం చెల్లించాల్సిందేనని సమాచార కమీషన్ స్పష్టం చేసినట్లు చుక్క గంగారెడ్డి పేర్కొన్నారు.

## సర్పంచ్‌కు సమాచారం లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### -అబ్బాపూర్‌లో వివాదం

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం వివాదానికి దారితీసింది. స్థానిక సర్పంచ్ చిట్యాల సౌందర్యకు సమాచారం ఇవ్వకుండా కేంద్రాన్ని ప్రారంభించారని ఆమె ఆరోపించారు. గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం అబ్బాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌కు ముందస్తు సమాచారం ఇవ్వలేదని సౌందర్య ఆవేదన వ్యక్తం చేశారు. తాను దళిత సర్పంచ్ కావడం వల్లే తనను అవమానించారని ఆమె ఆరోపించారు. గ్రామంలో ఇలాంటి ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించేటప్పుడు గ్రామపంచాయతీ పాలకవర్గానికి, ప్రథమ పౌరురాలికి సమాచారం ఇవ్వకపోవడం సరైన విధానం కాదని ఆమె ప్రశ్నించారు. అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇచ్చి, తనను పక్కన పెట్టడం ప్రత్యేకంగా అవమానించడమేనని దళిత సర్పంచ్ అవ్వటం వల్లే అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఫాక్స్ సొసైటీ కార్యదర్శి రామ సుధాకర్ రావును వివరణ కోరగా స్థానిక సర్పంచ్‌కు సమాచారం ఇవ్వాలని ఇంచార్జ్‌కు ముందే సూచించామని కానీ వారు సమాచారం ఇవ్వకపోతే తమ బాధ్యత కాదన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గొల్లపల్లి, ప్రభాతవార్త :



మండలంలోని రాఘవ పట్నం, గుంజపడుగు గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు జానకి, జ్యోతి మాట్లాడుతూ పిల్లలను మొబైల్, టెలివిజన్ కు దూరంగా ఉంచాలని దాని వల్ల పిల్లలపై పడే దుష్ప్రభావాలను గురించి తల్లులకు వివరించడం జరిగింది అలాగే పిల్లలకు అసెస్మెంట్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ లు కాసారపు భవాని అరవింద్, నవ్వ అంజన్న, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, జలజ, కస్తూరి పద్మ, ఎల్లెంకి మమత, ఏ ఎన్ ఎం శైలజ ఆయాలు ఆశా కార్యకర్తలు పిల్లలు తల్లులు పాల్గొన్నారు

# హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్‌కు చెంపపెట్టు

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి
- కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు
- పీసీ ఘోష్ కమిషన్ నివేదిక తిరస్కరణతో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ
- సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం



**సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అపోహలు సృష్టిస్తూ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రాజెక్టుపై ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ కమిషన్ నివేదికలను హైకోర్టు తోసిపుచ్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ అని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇటువంటి కమిషన్లు వేశారని, న్యాయస్థానం తీర్పుతో కాంగ్రెస్ కుట్రలు బట్టబయలయ్యాయని ధ్వజమెత్తారు. మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మిస్తేనే భవిష్యత్తులో తెలంగాణ నీటి హక్కులు భద్రంగా ఉంటాయని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మిస్తామని గొప్పగా హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఇంత కాలం గడుస్తున్నా కనీసం సాయిల్ టెస్ట్ (మట్టి పరీక్ష) కూడా చేయలేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను కేవలం ఆశల పల్లకిలో ఊరేగిస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కలలో కూడా కేసీఆర్ కనబడుతున్నారని, ఆ భయంతోనే ఆయన పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే, రేవంత్ రెడ్డిని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు గట్టిగా ఉంటేనే పాలకవర్గం సరైన దారిలో ముందుకు వెళుతుందని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపాయని, తెలంగాణ యావత్ దేశానికి ఆదర్శంగా మారిందన్నారు. ముఖ్యంగా సిరిసిల్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. "నా రాజకీయ జీవితంలో నలుగురు ముఖ్యమం త్రులను చూశాను. కానీ, కేవలం రెండేళ్లలోనే రాష్ట్రాన్ని సమూలంగా మార్చి, అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్ మాత్రమే" అని ప్రశంసించారు. తెలంగాణ భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే అది కేవలం కేసీఆర్ తోనే సాధ్యమని ఆయన ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు కొండూరు రవీందర్ రావు, గూడూరి ప్రవీణ్, జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మరియు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు బిడ్డగా కర్షకుల సంక్షేమానికి అహోరాత్రులు కృషి చేస్తా

- ❖ప్రభుత్వ విప్ విజయ రమణారావు
- ❖రైతు సమస్యల పరిష్కారంలో రాజీ పడబోనని స్పష్టీకరణ



**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

రైతు బిడ్డగా కర్షకుల సంక్షేమానికి అహోరాత్రులు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. గురువారం పెద్దపల్లి మండలం పాలెం, కాసుల పల్లె, గోపయ్యపల్లి, కాపుల పల్లె, కనగర్తి, బొంపెల్లి, మేడిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, నియోజకవర్గ రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని కాపాడతానని చెప్పారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గింజ కటింగ్ లేకుండా పెద్దపల్లిలో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. రైస్ మిల్లర్ల నుండి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విడతల వారీగా రైతు భరోసాను ప్రభుత్వం విడుదల చేస్తోందని, ప్రజల సంక్షేమం కోసం అలుపెరుగని కృషి చేస్తున్నామని వివరించారు. ఇంటింటికి ఇసుకను సులభతరం చేశామని, ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నెరవేరుస్తామని పేర్కొన్నారు. భూసారం పెంచేందుకు రైతులు పంటల మార్పిడి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి, మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, ఏదేల్లి శంకర్, ఆరే సంతోష్, బండారు రామ్మూర్తి, ఆర్కోటి సంతోష్, అంజి నాయక్, ముత్యాల నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో భద్రతే బలహీనం

- సమ్మె వేళ పోలీసుల నిర్లక్ష్యం బహిర్గతం
- సమ్మెతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపు
- సెల్‌ఫోన్లలో మునిగిన డ్యూటీ పోలీసులు
- అస్తవ్యస్తంగా మారిన రవాణా వ్యవస్థ
- ప్రజల్లో ఆగ్రహం.. అధికారులపై ఆశలు

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**

పెద్దపల్లి జిల్లా బస్టాండ్‌లో ఆర్టీసీ సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపిస్తుండగా, భద్రతా బాధ్యతలు చేపట్టాల్సిన పోలీసు సిబ్బంది నిరక్ష్య వైఖరి ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తోంది. ఒకవైపు బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు కాపాలా కాస్తున్న పోలీసులు తమ బాధ్యతలను విస్మరించిన దృశ్యాలు బయటపడుతున్నాయి. సమ్మె కారణంగా బస్టాండ్‌లో రద్దీ పెరిగి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడుతుండగా, సరైన సమాచారం లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి కీలక సమయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా, కొందరు సిబ్బంది మాత్రం సెల్‌ఫోన్లలో మునిగి విధులను పక్కనబెట్టినట్లు కనిపించింది. గుంపులుగా నిలబడి ఫోన్లలో మాట్లాడటం, ఇతర విషయాల్లో నిమగ్నమవడం ప్రజల్లో అసంతృప్తిని కలిగిస్తోంది. సహాయం కోసం వెళ్లిన వారికి సరైన స్పందన లేకపోవడం కూడా విమర్శలకు దారి తీస్తోంది. ఇక బస్టాండ్‌లో రవాణా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రైవేటు వాహనాలు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని నియంత్రించాల్సిన పోలీసులు స్పందించకపోవడం గమనార్హం. మొత్తానికి, సమ్మెతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలకు పోలీసుల నిరక్ష ్యం మరింత భారంగా మారింది. భద్రతా లోపాలపై ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని పరిస్థితిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



# గాలి.. వాన బీభత్సం

## -తడిసి ముద్దైన ధాన్యం

**తంగళ్ళపల్లి, ప్రభాతవార్త:**





అకాల వర్షం, ఈదురుగాలులతో తంగళ్ళపల్లి మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ గాలివానకు కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసిన ధాన్యం నీట మునిగింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. కోత దశలో ఉన్న వరి పంటలు నేలకొరిగాయి. గాలివానతో మామిడికాయలు నేలరాలాయి. ఈదురుగాలులు, అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం కష్టించి పండించిన పంట నేలపాలవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**వేములవాడ, ప్రభాతవార్త:**

రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. కొనుగోలు చేసిన



ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి, మల్లారం, వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు. ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేశారా లేదా అనే విషయాలను నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. తేమ శాతాన్ని పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దింపుకోవాలని నిర్వహకులకు సూచించారు. మర్రిపల్లిలోని మణికంఠ ఇండస్ట్రీస్, మారుతి ఇండ్రస్ట్రీస్‌లు, వేములవాడలోని శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులకు ధాన్యం లోడ్‌తో వచ్చిన వాహనాలను ఆలస్యం చేయకుండా దింపుకొని వాహనాలు తిరిగి కొనుగోలు కేంద్రాలను వెళ్లేలా సహకరించాలన్నారు.

# వంద శాతం గ్రౌండింగ్ చేయాలి

## -అదనపు కలెక్టర్ బి రాజా గౌడ్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త** జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 100 శాతం గ్రౌండ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై సంబంధిత ఎంపీడీవోలు మరియు ఇంజనీరింగ్ అధికారులు మరియు క్లస్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ మార్క్ ఔట్ చేయని ఇందిరమ్మ ఇండ్ల పట్టణ మరియు రూరల్ ప్రాంతాల్లో కలిపి మొత్తం జిల్లాలో 10860 ఇండ్లు పెండింగ్ లో ఉన్నాయని, ఏప్రిల్ 30 నాటికి ఈ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించాలని తెలిపారు.

# రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికాక తప్పదు

## -నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

మొక్కజొన్న రైతులను నానా అవస్థలకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాక తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్థానిక ఎమ్మెల్యే మాధవ రెడ్డి కి చిత్త శుద్ధి ఉంటే రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు విఫలమైందని ధ్వజమెత్తడు. మండలానికి ఒక్క కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే నష్టం రైతులకు తప్ప మాధవ రెడ్డికి నష్టం లేదన్నారు. బి ఆర్ ఎస్ అధికారం లో ఉన్నప్పుడు నెక్కొండ మండలానికి 9 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు నష్టం రాకుండా చూసామన్నారు. బోనస్ విషయం లో కూడ ప్రభుత్వం విఫలమైందని,





కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పేరుతో కేవలం ప్రదర్శనాత్మక చర్యలకు మాత్రమే పరిమితమైందని ఆరోపించారు. మండలానికి ఒక్క సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర ప్రకటించినా, దాని అమలు సరిగా లేక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రైవేట్ ట్రేడర్లపై ప్రభావం చూపుతుందని భావించినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారిందన్నారు. మొక్కజొన్న దిగుబడి, కొనుగోలు లక్ష్యాలు, నిల్వ సదుపాయాలపై ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం రైతుల్లో అనిశ్చితిని పెంచుతోందని విమర్శించారు. ఈ అంశాన్ని బిఆర్ఎస్ పార్టీ రాజకీయంగా ముందుకు తీసుకెళ్తూ, ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందనిఅయన తెలిపారు. ఈ నిరసనతో రాబోయే రోజుల్లో మొక్కజొన్న కొనుగోలు అంశంలో ఏమైనా సమస్యలు ఏర్పడితే ఎవరిని వదిలి పెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ గటిక అజయ్ కుమార్, మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మాజీ ఎంపీపీ జాటోత్ రమేష్, బి ఆర్ ఎస్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, తాటిపల్లి శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ ధోనికేనా సారంగపాని, కటుకూరి నరేందర్ రెడ్డి, బొల్లెబోయిన విరస్వామి, దేవానబోయిన విరభద్రం, కోర్లపాటి ప్రభాకర్, మాలోత్ పూర్ణ, కారింగుల సురేష్, రాగూరి కిషన్, రైతులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కష్టపడి ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు



దుగ్గొండి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

కష్టపడి ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలుగొండ రామస్వామి అన్నారు. మండల కేంద్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఢిల్లీకి వెళ్లిందన్నారు. అనంతరం కూరపాటి సుశీల, సహస్రకు వెయ్యి రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ఆటలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. ఆటలతో స్నేహ భావం పెరుగుతుందన్నారు. క్రీడలు భవిష్యత్‌లో మంచి మార్గాలను చూపిస్తాయన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కే. అహ్మద్, పీడీ ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నెక్కొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

మండలంలోని అప్పలరావుపేట గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, నూతన వివో బిల్డింగ్‌ల నిర్మాణ భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మాధవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ చౌహన్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఆవుల శ్రీనివాస్, కొనిజేటి భిక్షపతి, మాదటి శ్రీనివాస్ ,పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, కోశాధికారి కేవీ సుబ్బారెడ్డి, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివ, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, మైనారిటీ నాయకులు షైక్ షబ్బీర్, మహ్మద్ అన్వర్ ,అప్పలరావుపేట సర్పంచ్ ఉడుగుల అశోక్ ,పత్తిపాక సర్పంచ్ లావుడ్యా సామ్య, మాజీ ఎంపీటీసీ మచ్చ వీరన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజు, బొల్లెబోయిన సురేష్, లావుడ్యా రమేష్, ఏఈ పంచాయతీరాజ్ రాజ్ కుమార్, ఏపిఎం కిరణ్ కుమార్, సీసీ మంజుల రవి, ఏకాంబరం, కాంతయ్య, మోహన్ బాబు, వివోఏలు సాగర్ సప్న, అధ్యక్షులు శకుంతల, రాధిక, అకౌంటెంట్ శ్వేత పాల్గొన్నారు.

# ఉత్తమ ర్యాంకులు సాధించిన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ వారంలో భాగంగా గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో మూడో తరగతి నుండి 9వ తరగతి వరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతిలోని మొదటి, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థినులతోపాటు వారి తల్లిదండ్రులకు బహుమతులు అందజేసి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జనగామ, హనుమకొండ, తరిగొప్పుల స్పెషల్ ఆఫీసర్,



ఎంఈఓ జానకి ప్రత్యేకంగా హాజరై విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం జీవన నైపుణ్యాలు మైండ్స్ పార్క్ లాంటి అనేక కార్యక్రమాలను విద్యార్థులకు అందిస్తూ ప్రైవేటు పాఠశాలలతో సమానంగా పోటీపడుతూ విద్యార్థులను అత్యుత్తమంగా తయారు చేస్తున్నామని వారు తెలియజేశారు. తల్లిదండ్రులు కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వం వారికి 25వస్తువులతో కూడిన కిట్టును అందజేస్తుందని ఈసందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సురేందర్ రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ పార్వతిబాయ్, ఉపాధ్యాయులు బి.వాసు, బి.దశరథ్, సుమలత, సమ్మక్క, స్వరూప, తిరుపతి, శ్రీమతి, మాన్య, మల్లు, బాలాజీ, సుజాత, కల్పన, సునీత, రాము, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

భీమారం, ప్రభాతవార్త :

భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఏడవ తరగతి పూర్తిచేసుకుని వెళ్లే విద్యార్థుల తల్లులను ప్రత్యేకంగా సన్మానించడం ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్‌పై అవగాహన కల్పించేందుకు ప్రముఖ సైకాలజిస్ట్ డా. అడ్డిగ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ "సానుకూల పెంపకం యొక్క కళ" అంశంపై మాట్లాడి, పిల్లలను ప్రేమతో, సానుకూల దృక్పథంతో పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆటలు, పాటలు అందరినీ అలరించాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ తోగిటి జగదీష్, ప్రిన్సిపాల్ దాసరి వరదాం మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, దుంపాల మనోజ్ రెడ్డి, గోనె రవీందర్, ఎనుగంటి హరీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# చౌడారం మోడల్‌స్కూల్‌లో ఫలితాల పంట..

## - వందశాతం ఉత్తీర్ణత

జనగామ, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



జనగామ మండలం చౌడారం పి.ఎం.శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు 2025-26 వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా ఆరోతరగతి విద్యార్థి వబ్బా తేజ 92శాతం(205 రోజులు) హాజరుతో రికార్డు సృష్టించి, ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు అందుకున్నారు. తేజతో పాటు మెజారిటీ విద్యార్థులు భాషల్లో ఎ-గ్రేడ్లు సాధించారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల కృషిని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా అభినందించారు.

# ఘనంగా దేవతా ప్రతిష్ఠా మహోత్సవాలు ముగింపు

భీమారం, ప్రభాతవార్త:

మండలంలోని లింగంపేట గ్రామంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ భక్తాంజనేయ స్వామి పునః ప్రతిష్ఠా సహిత నూతన శ్రీ మహాగణపతి, నందీశ్వర, శివలింగ, పార్వతీ, నాగదేవత, నవగ్రహ, దీపస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఏప్రిల్ 21 నుంచి 23 వరకు నిర్వహించిన ఈ మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా సాగాయి. మొదటి రోజు గంగా సేకరణ, గోపూజ, గణపతిగౌరీ పూజలు, అంకురార్పణ, వాస్తు పూజలు, వివిధ హోమాలు నిర్వహించగా, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు గ్రామంలో ఆకట్టుకుంది. రెండవ రోజు మహాస్నపనం, నవగ్రహ హోమం, ప్రధాన దేవతా హోమాలు నిర్వహించి, సాయంత్రం రుద్రహోమం, దేవీ హోమం, మన్యు హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడవ రోజు ఉదయం సుప్రభాతంతో కార్యక్రమాలు ప్రారంభమై, శుభముహూర్తంలో యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహాబలిహరణం, పూర్ణాహుతి, కలశమార్జన, అలంకరణ, మహామంగళహారతి కార్యక్రమాలు భక్తుల మధ్య భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ మహోత్సవాలను వేదాచార్యులు, ఆగమ పండితులు, గ్రామ పురోహితులు వీరశైవ ఆగమోక్త విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణానికి గ్రామ సర్పంచ్ సుప్రియ హరీష్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. . భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సుప్రియ హరీష్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## గాంధీపార్క్ పాఠశాలలో ప్రగతి పత్రాల పంపిణీ

విద్యార్థులకు మార్గనిర్దేశం

- వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచన

గోదావరిఖని ,ప్రభాత వార్త:



స్థానిక ఎంపీపీఎస్ గాంధీపార్క్ పాఠశాలలో విద్యార్థులకు ప్రగతి పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కల్వల రంజిత్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మార్గనిర్దేశం చేశారు. వేసవి సెలవుల సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యాభిమానులు పాల్గొని పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. అదేవిధంగా, గాంధీపార్క్ పాఠశాలలో ప్రీప్రైమరీ మరియు ప్రాథమిక తరగతుల ప్రవేశాల కోసం ఆసక్తి గల తల్లిదండ్రులు వెంటనే పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని ప్రధానోపాధ్యాయుడు రాంబాబు కోరారు.

## సింగరేణి కార్మికులకు భారీ భరోసా

సహజ మరణానికీ రూ.10 లక్షల బీమా

ఎస్బీఐతో ఒప్పందం..

ఉచిత సౌకర్యంప్రమాద బీమాకు అదనం..

భరోసా రెట్టింపుహెల్త్, రిటైర్డ్ ఉద్యోగులకు మరిన్ని ప్రయోజనాలు

గోదావరిఖని, ప్రభాతవార్త:

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కార్మికులు సహజ మరణం చెందినా వారి కుటుంబాలకు రూ.10 లక్షల బీమా అందించనుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఒప్పందం కుదిరింది. లైఫ్ ఇన్సూరెన్స్ పథకం కింద ఈ సౌకర్యం అందించబడనుంది. ఈ నిర్ణయం ద్వారా సుమారు 40 వేల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. సింగరేణి సంస్థను నమ్ముకుని సేవలందిస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు అధికారులు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరీ ఖాతా కలిగిన ఉద్యోగులకు ఈ బీమా వర్తిస్తుంది. ముఖ్యంగా ఈ బీమా కోసం కార్మికులు ఎలాంటి అదనపు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తిగా ఉచితంగా ఈ సౌకర్యం లభించనుంది. సహజ మరణం సంభవించినప్పుడు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే సింగరేణి ఉద్యోగులకు ప్రమాద బీమా అమల్లో ఉన్న విషయం తెలిసిందే. 2021-22 నుంచి అమలులో ఉన్న ఈ పథకాన్ని ఇటీవల ప్రభుత్వం కోటి రూపాయలకు పెంచింది. ప్రమాదవశాత్తు మరణించిన సందర్భాల్లో కుటుంబాలకు రూ.1 కోటి వరకు బీమా అందుతోంది. తాజాగా సహజ మరణానికీ రూ.10 లక్షల బీమా కల్పించడంతో కార్మికులకు భరోసా మరింత పెరిగింది. ఉద్యోగి మరణించినప్పుడు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. ఇదిలా ఉండగా, ఎస్బీఐ ద్వారా సింగరేణి కార్మికులకు ఆరోగ్య బీమా సౌకర్యం కూడా అందుతోంది. కార్మికుల కుటుంబాలకు రూ.8,906 ప్రీమియంతో రూ.50 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తున్నారు. దీనికి తోడు ప్రమాద బీమా సౌకర్యం కూడా కొనసాగుతోంది. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేకంగా బీమా వర్తిస్తోంది. పదవీ విరమణ పొందిన కార్మికులకు 70 ఏళ్ల వయస్సు వరకు రూ.30 లక్షల బీమా రక్షణ లభిస్తోంది. సింగరేణి సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొంటున్నారు. సహజ మరణానికీ బీమా వర్తింపజేయడం ద్వారా కార్మిక కుటుంబాలకు భరోసా పెరిగిందని అభిప్రాయపడుతున్నారు. ఈ పథకం అమలుతో కార్మికులలో భద్రతాభావం మరింత పెరుగుతుందని, సంస్థపై నమ్మకం బలపడుతుందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోందని తెలిపారు.

## లక్ష్మీపూర్ పాఠశాలలో పీటీఎం సమావేశం

గోదావరిఖని ,ప్రభాతవార్త:

21వ డివిజన్ పరిధిలోని ఎంపీ యుపిఎస్ లక్ష్మీపూర్ పాఠశాల ఆవరణలో గురువారం అకాడమిక్ ఇయర్ 2025-26 చివరి పని దినం సందర్భంగా తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా 21వ డివిజన్ కార్పొరేటర్ కందుల సతీష్ స్వరూప హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదలపై చర్చించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే పాఠశాలలో ప్రారంభం కానున్న డిజిటల్ తరగతులపై తల్లిదండ్రులకు వివరించారు. ఆధునిక బోధన విధానాలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. జూన్ మొదటి వారంలో 'బడిబాట' కార్యక్రమం నిర్వహించి కొత్తగా విద్యార్థులను చేర్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు మాధవరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతోనే న్యాయం సాధ్యం

జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే సమాజంలో న్యాయం సులభంగా సాధ్యమవుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ పేర్కొన్నారు. గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కాట్నపల్లి గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయ సహాయం అందించడం లక్ష్యంగా పలు గ్రామాలలో ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుటుంబ, ఆస్తి సంబంధిత తగాదాల పరిష్కారానికి సుల్తానాబాద్ కోర్టులోని న్యాయసేవాధికార సంస్థను సంప్రదిస్తే తగిన న్యాయ సహాయం అందిస్తామని సూచించారు. ఇటీవల కాట్నపల్లి ఇటుక బట్టీలో కుక్కల దాడిలో బాలిక మృతి చెందడం బాధాకరమని జడ్జి గణేష్ తెలిపారు. ఇటుక బట్టీ యజమానులు కార్మికుల కుటుంబాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కుక్కల బెడద నివారణకు ప్రహరీ గోడలు నిర్మించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మృతి చెందిన బాలిక కుటుంబానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సహాయం, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు బోయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వడ్లకొండ రవికిరణ్, సర్పంచ్ పోగుల ఓగుల పూజ రాజేందర్, ఎంపీవో మోనిక, గ్రామ కార్యదర్శి రమేష్, జీపీవో దివ్య, ఉప సర్పంచ్ దాసరి రాయమల్లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

జూలపల్లి, ప్రభాతవార్త:

జూలపల్లి మండలం నాగులపల్లి గ్రామంలో గురువారం రోజున శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్ల మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలపల్లి మండల ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని సీతారామస్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోలవేణి లత వీరయ్య, గ్రామ పాలకవర్గం సభ్యులు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు తొగరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాంపల్లి సంపత్ కుమార్, దండే వెంకటేశ్వర్లు, మెండ తిరుపతి, నల్ల నరేందర్ రెడ్డి, కుంటూరి అంజమ్మ లక్ష్మయ్య, లంక స్వామి, మండల నాయకులు కూసుకుంట్ల రవీందర్ రెడ్డి, పాతకుల అనిల్, ఎంపీఓ శేషయ్య సూరి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతియుత వాతావరణంలోనే సమ్మె నిర్వహించుకోవాలి

పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి

ఆర్టీసీ డిపోల వద్ద భద్రత పర్యవేక్షణ

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** శాంతియుత వాతావరణంలోనే సమ్మె నిర్వహించుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడు ఆర్టీసీ బంద్ నేపథ్యంలో గోదావరిఖని, మంథని డిపోలను సందర్శించిన ఆయన, శాంతి భద్రతలపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బి. రామ్ రెడ్డి మాట్లాడుతూ సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను శాంతియుతంగా వ్యక్తపరచాలని, చట్టాన్ని గౌరవిస్తూ ప్రవర్తించాలని సూచించారు. డిపో, బస్ స్టాండ్ పరిసరాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలపై వెంటనే స్పందించాలని విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. బంద్ సందర్భంగా ప్రజలు వదంతులను నమ్మకూడదని, ఎటువంటి సమస్యలు గమనించిన వెంటనే పోలీస్ కు సమాచారం అందించాలని కోరారు. ఆస్తులకు నష్టం కలిగించే వారిపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, మంథని సీఐ బి. రాజు, ఎస్సై రమేష్, ఆర్టీసీ డీఎంలు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలను నిరంతరం పరిశీలన చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

పిల్లల ఎదుగుదలను నిరంతరం పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి సంక్షేమ శాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్వైజర్లు క్రమం తప్పకుండా సందర్శించాలని, నమోదు చేసిన ప్రతి చిన్నారి హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాజరు మెరుగుపరచడంలో నిరక్ష్యంల్ల వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పోషణ స్థాయిని మెరుగుపరచాలని సూచించారు. ఇండస్ట్రియల్ ప్రాంతాలు, ఇటుక భట్టీలు (బ్రిక్ కిల్న్‌లు) వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లల వివరాలను సేకరించాలని, ఆ ప్రాంతాల్లో పిల్లలకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి పరిశ్రమల ద్వారా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పిల్లల సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ముఖ్యంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 పై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఎక్కువ కేసులు అధికారుల దృష్టికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణన ప్రక్రియ

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెన్సస్ 2027లో భాగంగా, పెద్దపల్లి జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను ఏప్రిల్ 26, 2026 నుండి మే 10, 2026 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డిజిటల్ విధానం ద్వారా పౌరులు ఎటువంటి ఆటంకం లేకుండా, ఇంట్లోనే ఉండి ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి వివరాలను నమోదు చేసుకోవచ్చని, తద్వారా గణన ప్రక్రియ మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా మరియు వేగంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకున్న తర్వాత, 11 అంకెల ప్రత్యేక సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జనరేట్ అవుతుందని, ఆ ఐడిని స్క్రీన్‌షాట్ తీసుకోవాలని లేదా నోట్ చేసుకోవాలని తెలిపారు. గణన కోసం ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు, సదరు ఐడిని వారికి చూపడం ద్వారా ధృవీకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ఆయన వివరించారు. జిల్లా ప్రజలందరూ ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సెన్సస్ 2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



## కాంగ్రెస్ నాయకుల్లో వ్యతిరేఖత

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి గురువారం విచ్చేసిన నాయకులపై కాంగ్రెస్ పార్టీ సొంత కార్యకర్తలే అసహనం వ్యక్తం చేశారు.గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం,ప్రధానకార్యదర్శి అన్నాడి సంపత్ రెడ్డి లు కొనుగోలు కేంద్ర ప్రారంభం కోసం వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త ఐరెడ్డి మహేందర్ రెడ్డి ని ప్రశ్నించారు.కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోయారు.పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేస్తే మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో లేని, కొత్తగావచ్చిన వారిని ఆదరిస్తూ వారికే ప్రాముఖ్యతనిస్తూ పార్టీ గెలుపు కోసం సొంత పెట్రోల్,ఖర్చులతో గ్రామాలు తిరిగి పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన వారికీ దక్కే గౌరవం ఇదేనా అన్నారు.భజనపరులకు సమాచారం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు

## విద్యార్థులు సామాజిక సేవను అలవాటు చేసుకోవాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్ సూచించారు.పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దీక్ష స్వీకార కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు.స్కౌట్ మాస్టర్స్ ఠాగూర్,గైడ్ కెప్టెన్ జిష సమక్షంలో 16 మంది స్కౌట్స్ 16 మంది గైడ్స్ దీక్ష స్వీకారం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థినీ విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ,పర్యావరణ పరిరక్షణ,సమాజ సేవ పెంపొందించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలోఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

మండలములోని వంతడుపుల గ్రామ పరిధిలోగల తెనుగువానిపల్లికి చెందిన కీసరీ దీపక్ పై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు జరిగినట్లు స్థానిక ఎస్ ఐ అశోక్ గురువారం తెలిపారు.పిర్యాదురాలు అలుక మోనిక కిరాణా దుకాణం వద్ద బీరు సీసాతో వచ్చి సిగరేటు ఉద్దెర ఇవ్వలేదని మోనికను ఆమె భర్త అరవింద్ ను నెట్టి వేసి భూతులు తిట్టడముతో పాటు కులం పేరుతో దూశించినందుకు కీసర దీపక్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు

## చలివేంద్రం ప్రారంభం

ముస్తాబాద్ ప్రభాత వార్త

నామాపూర్ గ్రామములో చిట్టబోయిన లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చిట్టబోయినదేవేందర్,కిషన్,మనోహర్ లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా గ్రామసర్పంచ్ మాదాసు అనిల్ గురువారం చలివేంద్రాన్నిప్రారంభించారు.ఈ కార్యక్రమములో ఉప సర్పంచ్ తాడేపల్లి కొమురయ్య,వార్డు సభ్యులు షఫీ,వకిల్,అశోక్,కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, రామీరెడ్డి,జూకంటి సుధాకర్ రావు,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఆర్థిక సాయం అందజేసిన మాజీ కౌన్సిలర్

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త



: సిరిసిల్ల పట్టణంలో ఈదర గాలుల బీభత్సానికి 17 వ వార్డు గాంధీనగర్ మార్కెట్ రోడ్ లో గల నాలుగు అంతస్తుల భవనం పై గోడ కూలి పక్కన ఉన్న రేకుల ఇంటి పైన పడడంతో ఇంటిలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఇద్దరు అమ్మాయిల పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని కరీంనగర్ కి తరలించారు . మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఏరియా ఆస్పత్రికి వెళ్లి గాయాలపాలైన కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## 100 పడకల ఆసుపత్రికి భూమి సర్వే పూర్తి

వర్ధన్నపేట/ఏప్రిల్ 23 ప్రభాత వార్త



వర్ధన్నపేట నియోజకవర్గం కేంద్రంలో 100 పడకల ఆధునిక ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు నేడు భూ సర్వే నిర్వహించారు. వర్ధన్నపేట సర్వేయర్ గీత, జీపీవో రమేష్ బృందం నిర్వహించిన సర్వేలో 7.9 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ అతి త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే స్థానికులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శిభారాణి రాజేందర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, కమ్లి కీమా నాయక్, వాణి కుమారస్వామి, ఈగ దామోదర్, నందిపాక భాస్కర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డ్రైవర్ శంకర్ ను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

వరంగల్ సిటి ఏప్రిల్23 ప్రభాతవార్త



నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ త్వరగా కోలుకోవాలని బిఅర్ఎస్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యే లు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి,నన్నపునేని నరేందర్,చల్లా ధర్మారెడ్డి లు అన్నారు.అర్టీసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె లో ఘోర సంఘటన చోటు చేసుకుంది. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేసి ప్రస్తుతం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆ విషయం తెలుసుకున్న బిఅర్ఎస్ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే లు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్,చల్లా ధర్మారెడ్డి లు ఆందోళన వ్యక్తం చేశారు.ఎంజీఎం లో ఉన్న శంకర్ ను పలువురు నాయకుల తో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా వైద్యులను కలిసి శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేయడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పై వారు ధ్వజమెత్తారు.అర్టీసి కార్మికుల సమస్యలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.శంకర్ గౌడ్ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షి ంచారు.అలాగే ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.వారి తో పలువురు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ కార్యక్రమం

మాడుగులపల్లి, ఏప్రిల్ 23ప్రభాతవార్త ఏప్రిల్

9 నుంచి ఏప్రిల్ 23 వరకు నిర్వహించిన పోషణ మాసం, కార్యక్రమం లో భాగంగా గురువారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన పోషణ పక్వడా కార్యక్రమం లో చిన్నారులకు, భాలింతలకు,గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించి తీసుకోవాల్సిన పోషక ఆహారం, తగు జాగ్రత్తలపై, స్థానిక సర్పంచ్ ఆరూరి నరేష్, ఏస్ ఐ క్రిష్ణయ్య లతో కలసి అవహగాహన కల్పించిన సీడీపీఓ చంద్రకళ. ఈ కార్యక్రమంలో, పంచాయతీ సెక్రటరీ ఖాసీం,రెవిన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమ్యశ్రీ, అంగన్వాడీ సూపర్ వైజర్ లక్షి ్మ, నాగమని, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాయకులు

## వర్ధన్నపేట లో త్వరితగతిన కాంటాలు పూర్తి చెయ్యాలి

వర్ధన్నపేట/ఏప్రిల్ 23 ప్రభాత వార్త

రైతుల సంక్షేమమే లక్ష ్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు గురువారం వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

**కొనుగోలు కేంద్రాల ప్రారంభం**

వర్ధన్నపేట మండలంలోని చెన్నారం, రామోజీ కుమ్మరిగూడెం, ల్యాబర్తి, బండౌతాపురం, మరియు రామవరం గ్రామాల్లో ఈ కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మార్కెట్ డి.పి.ఎం దాసు, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజి రెడ్డి , పోశాల వెంకన్న గౌడ్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను రైతులకు సూచనలను అందించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్నారు. ఒకవేళ అధికారుల నిరక్ష ్యంల్ల ఉన్నా లేదా రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైనా వెంటనే ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు దృష్టికి తీసుకురావాలని కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ రైతే రాజు కావాలనే లక్ష ్యంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎం రమణాచారి, సి.సి అనిత, మండల సమైక్య అధ్యక్షురాలు ప్రమిల దేవి, చెన్నారం సర్పంచ్ సింధం లలిత లక్ష్మీ ్మనారాయణ, ల్యాబర్తి ఉప సర్పంచ్ గంగా రాజు, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి చిదుముళ్ళ భాస్కర్, రామోజీ కుమ్మరిగూడెం సర్పంచ్ భూక్యా సుశీల శంకర్, రామవరం సర్పంచ్ మీనా, భూక్యా మల్లు నాయక్, ఉప సర్పంచ్ భూక్యా తిరుపతి, బర్ల సహదేవ్, బర్ల సతీష్, కర్ర ప్రశాంత్ రెడ్డి, గజ్జెల సోమ నర్సయ్య, ఎండీ జె లిల్ మరియు పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా చల్మెడ జన్మదిన వేడుకలు

ప్రభాత వార్త కోనరావుపేట



కోనరావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలోవేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు జన్మదిన వేడుకలు గురువారంఘనంగానిర్వహించారు.వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగామాట్లాడుతూ,సుమారు 20 ఏళ్ల క్రితం వైద్య కళాశాల స్థాపించి వేలాది నిరుపేద కుటుంబాలకు లక్షలాది అభాగ్యులకు వైద్యం అందించి చల్మెడ ఆరోగ్య ప్రదాత అయ్యాడని అన్నారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి స్వామి ఆశీస్సులతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో పాటు సుఖ సంతోషాలు శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఉద్యమ నేత కేసీఆర్ బాటలో నడుస్తున్న చల్మెనాయకత్వంలో పని చేయడం సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచులు బొజ్జ మల్లేశం శివతేజరావు మండల జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు నేడు

– వేములవాడ రూరల్‌లో నిర్వహణ

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండల కేంద్రంలో నేడు ఎస్సీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు.ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థులకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ముందుగానే సమాచారం చేరవేయబడింది. రేపు ఉదయం 11.00 గంటలకు బ్యాంకు మేనేజర్‌తో పాటు సంబంధిత అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూ ప్రక్రియ కొనసాగనుంది.ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల మరియు ఆదాయ ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. నిర్ణీత సమయానికి ముందుగానే హాజరై, అధికారుల మార్గదర్శకాలను పాటించాలని కోరారు.ప్రభుత్వ పథకాల కింద అర్హులైన వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుండి గణనీయ సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

## ప్రభుత్వ పాఠశాలను రక్షించుకోవాలి

చందుర్తి ప్రభాతవార్త

చందుర్తి మండలం , ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొజ్జ మల్లేశం, మాట్లాడుతూ....ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. వినూత్నమైన బోధన అభ్యసన కృత్యాలతో ఒత్తిడి లేని చదువులు చెప్పడం జరుగుతుందన్నారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించడం, పిల్లల్లో సృజనాత్మక ఆలోచన, ప్రశ్నించే తత్వం, విలువల విద్యను అందిస్తూ సంపూర్ణ వికాసానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ప్రత్యేక డ్రెస్ వేసి ప్రోగ్రెస్ కార్డ్స్ ఇవ్వడం జరిగింది.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు సంపతి రమేష్, తిరుమల, అక్షిత, సిఆర్పి వినయ్, వార్డు సభ్యులు, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## సర్వే చేసిన ఇమ్యూ రేటర్స్ కి బకాయిలు చెల్లించాలి

చందుర్తి ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఇమ్యూరేటర్స్ కు బకాయిలను చెల్లించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు హైకోర్టు అడ్వకేట్ ఈడుగు రజనీకాంత్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశానికే ఆదర్శమని రాష్ట్ర మంత్రుల నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు గొప్పగా చెప్తున్న సర్వే చేసిన ఇమ్యురేటర్స్ కి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి జీతభత్యాలు చెల్లించలేదన్నారు,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఇమ్యూనరేటర్స్ కి న్యాయబద్ధంగా రావాల్సిన 150 కోట్ల రూపాయలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘల సభ్యులు టీచర్లు దాదాపు పది రోజులు కష్టపడి గ్రామ గ్రామాన ఇంటింటికి తిరుగుతూ హౌస్ లిస్టింగ్ చేస్తూ సర్వే చేశారని ఒక్కొక్కరికి పదివేల రూపాయలు, ఇమ్యూనరేటర్స్ మీద ఉన్న మండల స్థాయి అధికారులకు సూపర్వైజర్స్ కి 15 వేల రూపాయలు ఇస్తామని రేవంత్ రెడ్డి సర్కార్ జీవో విడుదల చేసింది కానీ 2024 నుండి ఇప్పటి వరకు ఎలాంటి బకాయిలు చెల్లించకపోవడం ఇది లేబర్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా కోటి యాభై లక్షలు, అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 150 కోట్లు త్వరితగతిన విడుదల చేయాలన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు

**చందుర్తి, ఏప్రిల్23: ప్రభాతవార్త** చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని శ్రీ మోహిని కుంట మల్లికార్జున స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించినట్లు సర్పంచ్ మరాఠీ మల్లిక్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లిక్ మాట్లాడుతూ ఆలయ హుండీ రెండు సంవత్సరాల తర్వాత అగ్రహారం ఆలయ ఈఓ ఉడుతల వెంకన్న పర్యవేక్షణలో లెక్కింపు చేయగా రూ.2,39,557 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రం రామిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నక్క గంగాధర్,నాయకులు బైరగోని రమేష్, కమిటీ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా పలు వివాదాల నేపథ్యంలో హుండీ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు ఈఓ ఉడుతల వెంకన్న తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కోనరావుపేట,రూరల్ ప్రభాతవార్త:** కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎఎంసి చైర్మన్ ఎల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ సాయి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ..ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంటి కల సాకారం

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఎదురుగట్ల గ్రామంలో నరెట్ల అనురాధ గృహప్రవేశంతో పాటు, లింగంపల్లి సహా మరికొన్ని గ్రామాల్లో లబ్ధిదారులు కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో పూజలు నిర్వహించి కొత్త ఇళ్లలోకి ప్రవేశించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వస్త్రాలు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆయన పేర్కొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**గొల్లపల్లి, ప్రభాతవార్త :** మండలంలోని రాఘవపట్నం, గుంజపడుగు గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు జానకి, జ్యోతి మాట్లాడుతూ పిల్లలను మొబైల్, టెలివిజన్ కు దూరంగా ఉంచాలని దానివల్ల పిల్లలపై పడే దుష్ప్రభావాలను గురించి తల్లులకు వివరించడం జరిగింది అలాగే పిల్లలకు అసెస్మెంట్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ లు కాసారపు భవాని అరవింద్,నవ్వ అంజన్న, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, జలజ,కస్తూరి పద్మ,ఎల్లెంకి మమత, ఏ ఎన్ ఎం శైలజ ఆయాలు ఆశా కార్యకర్తలు పిల్లలు తల్లులు పాల్గొన్నారు

## చల్మెడ లక్ష్మీనరసింహారావు జన్మదిన వేడుకలు

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త..**వేములవాడ రూరల్ మండలంలో భారత రాష్ట్ర సమితి పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ చల్మెడ లక్ష్మీ ౹నరసింహారావు గారి జన్మదిన వేడుకలు గోస్కుల రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 9.00 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదురుగట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేక్ కటింగ్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సీనియర్ నాయకులు ఏస తిరుపతి, సర్పంచులు షేక్ షాదుల్లా, ప్రణీత్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, కటుకం మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షులు పెండ్యాల శంకర్, బండారి ప్రణయ్, తీగల శ్రీనివాస్, నూకలమర్రి తిరుపతి, దేవరాజ్, పసుల అంజిబాబు, గుడిసె దేవరాజ్, వెంకటేష్, గోపు మధు, నేదురు సంతోష్, తలారి రవి, తిరుపతిరావు, కోడిమ్యాల మురళి, గాజుల శ్రీనివాస్, లక్కే కృష్ణ, నేరెళ్ల నరసయ్య, నేరెళ్ల మహేష్, నల్ల శ్రీనివాస్ రెడ్డి, సంపేట శ్రీనివాస్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదినాన్ని పురస్కరించుకొని నాయకులు స్వామివారి ఆశీస్సులు తీసుకుని, నేతకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యువకులు, మహిళలు ఉత్సాహంగా శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలను ఉత్సవ వాతావరణంలో నిర్వహించారు. స్వీట్ల పంపిణీతో పాటు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ పార్టీ శ్రేణులు ఐక్యతను ప్రదర్శించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న నాయకత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. జన్మదిన వేడుకలు సాదాసీదాగా కాకుండా భక్తి, ఆనందం, ఐక్యతల సమ్మేళనంగా సాగడం విశేషంగా నిలిచింది.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని తిర్మలపూర్ (పి.డి) ప్రభుత్వ ఉర్దూ మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంచే ఉద్దేశంతో ఎస్ఎంసీ కమిటీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులైన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు (ప్రోగ్రెస్ కార్డులు) అందుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ముఖిముద్దీన్ మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను పూర్తి చేసి తదుపరి ఉన్నత తరగతుల్లోకి అడుగుపెడుతున్న విద్యార్థులను అభినందించడం ఈ గ్రాడ్యుయేషన్ వేడుకల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి కొత్తపల్లి విక్రమ్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచడమే కాకుండా, విద్యార్థుల్లో ఉన్నత విద్య పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మస్కం ఆంజనేయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రిహాన, సభ్యులు నఫీస్, అప్సనా, గౌషియా, సైఫ్ సమ్రీన్, కుల్సుమ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పోరండ్ల శివాలయ ప్రాంగణంలో కొలువైన మారుతి వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

పాల్గొన్న జగిత్యాల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ పోరండ్ల గ్రామంలోని శివాలయ ఆవరణలో శ్రీ హనుమాన్ నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది.పోరండ్ల మాజీ సర్పంచ్ గూడా మల్లారెడ్డి స్వప్న దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో హోమం,ప్రత్యేక పూజలు శాస్త్రోక్తమైన విధివిధానాలతో విగ్రహ ప్రతిష్టాపనను నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులందరికీ గ్రామస్తుల సహకారంతో భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టగా,అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి అతిథులుగా సీనియర్ పాత్రికేయులు,జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్,ఉపాధ్యక్షులు బదనపల్లి మల్లేశం,ఎమ్మెస్ ఓ మల్లేశం గౌడ్ హాజరయ్యారు.అలాగే సీనియర్ పాత్రికేయులు రమేష్ పటేల్ వంగల,దీటి అంజయ్య పటేల్, కర్రు తిరుపతి పటేల్,కచ్చకాయల దేవేందర్ పటేల్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు అందుకున్నారు.



# ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

## రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దు...

### మానకొండూర్ మార్కెట్ చైర్మన్, మర్రి ఓదెలు యాదవ్

మానకొండూర్ /ప్రభాతవార్త:

రైతులు ఆరుగాలం పాటు కష్టపడి పండించిన ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని మానకొండూరు మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్ అన్నారు. గురువారం మానకొండూర్, దేవంపల్లి, ఊటూర్ సొసైటీ ఆధ్వర్యంలో ముంజంపల్లి, మానకొండూర్, గంగిపల్లి, దేవంపల్లి, ఊటూర్, లక్ష్మీపూర్, వెల్ది గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ ఓదెలు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేపట్టాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులకు త్రాగునీరు, టెంటు ఏర్పాటు చేపట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల్లో ధాన్య విక్రయించిన వారం రోజుల్లోనే రైతు బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం తాలు పేరుతో రైతులను దోపిడి చేస్తే చర్యలు తప్పవు అన్నారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా గ్రామ గ్రామాన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వెల్ది గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద టెంట్లు, త్రాగునీరు ఏర్పాటు చేయలేదని, రైతుల పట్ల, ప్రజా ప్రతినిధుల పట్ల నిరక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని గ్రామ సర్పంచ్ పెంచాల కిషన్ రావు, ఉప సర్పంచ్ రుద్రవరం సాయికుమార్ సొసైటీ నిర్వాహకులపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నందగిరి రవీంద్ర చారి, గ్రామ సర్పంచులు నందగిరి కనకలక్ష్మి, శ్రీనివాస్, పెంచాల కిషన్ రావు, ఎడ్ల సత్యనారాయణ, కళ్యాణి కిషోర్, కొత్త రామ్ రెడ్డి, ఉప సర్పంచులు రుద్రవరం సాయికుమార్, రాపాక ప్రవీణ్, కొమురయ్య యాదవ్, మండల నాయకులు తాళ్ల పెల్లి సంపత్ గౌడ్, రామిడి శ్రీనివాస్ రెడ్డి, దవ్వ శ్రీనివాస్ రెడ్డి, విశ్వనాథ చారి, కోండ్ర సురేష్, చలిగంటి ఓదెలు, దేవయ్య, ఎడ్ల కనక రెడ్డి, రుద్రవరం ప్రభాకర్, సొసైటీ ప్రత్యేక అధికారులు కరణ్ కుమార్, నోడల్ అధికారి కె.రవికుమార్, సీఈఓ లో లక్ష్మారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ఎడ్ల స్వామి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గడ్డం వెంకటరమణ, తిరుపతి, చావన్ లాల్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



# ఇందుర్తి లో స్వచ్ఛమైన పల్లి నూనె తయారు నాణ్యతకు పెద్దపీట రసాయనాలకు దూరం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

స్వచ్ఛమైన ఆరోగ్యం కోసం, నాణ్యమైన పల్లి నూనె కోసం ఎంతో దూరం వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనకు అతి సమీపమైన చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామం లో వీరాంజనేయ ఆయిల్ మిల్లు వాళ్ళు స్వచ్ఛమైన పల్లి నూనె కేవలం లీటర్ 250 రూపాయల చొప్పున ప్రజలకు విక్రయిస్తున్నారు. శుద్ధమైన పల్లీలు తెప్పించి, ఎటువంటి రసాయనాలు, ఇతర పదార్థాలు ఉపయోగించకుండా వినియోగదారుడి కళ్ల ముందే పల్లీలను మిషన్లో వేసి స్వచ్ఛమైన నూనెను తీసి నేరుగా వినియోగదారుడికి అందజేస్తున్న వైనం పట్ల సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లో రాజీ పడకుండా శుభ్రతకు పెద్దపీట వేసి ప్రజా ఆరోగ్య నిబంధనల మేరకే అతి తక్కువ ధరకు సామాన్యుడికి అందుబాటులో కి తెస్తున్న వీరాంజనేయ ఆయిల్ మిల్ యజమాని వేముల రామ్మోహన్ ను అభినందిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల కింద ఇందుర్తి లో స్వంతంగా ఆయిల్ మిల్ ఏర్పాటు చేసుకొని, సిబ్బంది సహాయం తో మిల్లు నిర్వాహణ కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు రామ్మోహన్ ప్రభాత వార్త ద్వారా తెలియజేస్తున్నారు. తాము రోజుకు దాదాపు 100 లీటర్ల వరకు నూనె ఉత్పత్తి చేసే విధంగా మిల్లు సామర్థం కలిగి ఉన్నదని అంటున్నారు. కేవలం ప్రజారోగ్య దృష్ట్యా ఈ మిల్లు రన్ చేస్తున్నట్లు, అతి తక్కువ ధరకే సామాన్యుడికి అందుబాటులో అందజేస్తున్నట్లు తెలిపారు. పల్లి నూనె తో బాటుగా త్వరలో నువ్వుల నూనె కూడా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు రాబోతున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ఎన్నో రకాల నూనెలను వాటి నాణ్యత లోపం మనకు కంటికి కనిపించకుండా తయారీ ప్యాకింగ్ తో మోసపోతున్న మనకు ఈ పల్లి నూనె ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని నూనె వాడుతున్న వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# సుందరగిరిలో హిందూ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

చిగురుమామిడి, ప్రభాత వార్త :

శ్రీ వెంకటేశ్వర హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో మే 3వ తేదీన జరగబోయే హిందూ సమ్మేళన గోడపత్రికను సుందరగిరి శ్రీ వెంకటేశ్వర ఆలయం ముందు ఉప మండలంలోని గ్రామాలైన సుందరగిరి,బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, నవాబుపేట, కొండాపూర్, బంజరుపల్లి, బొల్లొనిపల్లి, గ్రామాల హిందూ బంధువులందరితో హిందూ సమ్మేళన గోడపత్రికను గురువారం రోజున ఆవిష్కరించడం జరిగింది. గోడ పత్రిక ఆవిష్కరణ అనంతరం హిందు సమ్మేళన సమితి అధ్యక్షులు శ్రీ రామోజు రాజకుమార్, తిమ్మాపూర్ ఖండ సంపర్క ప్రముఖ్ శ్రీ దరిపెల్లి నర్సింగా రావు గార్లు మాట్లాడుతూ హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపమండలం తోపాటు పరిసర గ్రామాల హిందువులంతా కుటుంబాలతో పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణ,దేశ అభివృద్ధి, పంచ పరివార్తన్ తదితర అంశాల గురించి తెలుసుకొని హిందువులంతా చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపసర్పంచ్ లు మెడబోయిన రాజు,కానవేని జితేందర్ మాజీ ఉపసర్పంచులు జంగ శ్రీనివాస్ రెడ్డి,పెండాల సదానందం, ఆలయ డైరెక్టర్ పూల లచ్చిరెడ్డి, సమ్మేళన సమితి ప్రధాన కార్యదర్శి మాడ శ్రీనివాస్,కోశాధికారి, బింగి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కంది శంకర్, పత్తేమ్ మొగిలి, సంయుక్త కార్యదర్శి గుమ్మడి మధు, గంధం సురేందర్, తులాయిల వెంకటేష్, ఆంజనేయులు, అనిల్,పైడిపెల్లి శ్రీనివాస్,ఆరెల్ల శ్రీనివాస్,ఆదినారాయణ, విష్ణు, సంతోష్, రాములు, మురళి, బాలయ్య, సమ్మయ్య, రమేష్, రవి,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద

వరంగల్ సిటి ఏప్రిల్23 ప్రభాతవార్త

వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ లు అందజేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్,అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ఛాంబర్లో జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం నమోదు చేసుకున్న వారి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రయత్నించాలని ఆమె సూచించారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026 28 సంవత్సరానికి నూతన కార్డులు జారీచేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు మంజూరు

# ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం బాధాకరం

### బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి

మానకొండూర్/ ప్రభాతవార్త:

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ నర్సంపేట బస్టాండ్ లో ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ముమ్మాటికి రాష్ట్ర ప్రభుత్వ నిరక్ష్యమేనని బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి అన్నారు. గురువారం



ఏర్పాటు చేసిన సమావేశంలో యాదగిరి మాటా ్లడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు గాని హామీలిచ్చి అధికారం లోకి వచ్చాక అబద్ధాలతో కాలం గడుపుతుందని ఆరోపించారు. ప్రజా పాలన పేరుతో ప్రజలని తప్పుదోవ పట్టిస్తున్న తరుణం లో మాకు న్యాయం జరగదని భావించిన సందర్భంలో ఎన్ని ధర్నాలు చేసిన లాభం లేదని గ్రహించి మనస్థాపానికి గురై న ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్యా యత్నం చేసుకోవడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించి తక్షణమే ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# గ్రీన్‌కో స్వచ్ఛంద సంస్థ పాఠశాలకు కంప్యూటర్స్ అందజేత.

మానకొండూర్/ ప్రభాతవార్త :

మానకొండూరు మండలంలోని అన్నారం, లింగాపూర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రీన్ కో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్స్, క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. గ్రీన్ కో




స్వచ్ఛంద సంస్థ వారు అన్నారం ప్రభుత్వ పాఠశాలలోని చదివే పేద విద్యార్థులకు క్రీడా యూనిఫాం, స్కూల్ బ్యాగ్, 6 రకాల క్రీడా, కిట్లు అందజేశారు. లింగాపూర్ ప్రభుత్వ పాఠశాల కు కంప్యూటర్ లను ఆ గ్రామ సర్పంచ్ సమ్మక్క చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులకు ఉన్నత చదువులకు ఉపయోగ విధంగా ఉండాలని ఉద్దేశంతో గ్రీన్ కో స్వచ్ఛంద సంస్థ కంప్యూటర్లు, క్రీడా పరికరాలను అందజేస్తూ విద్యార్థులకు ప్రోత్సహించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ కో స్వచ్ఛంద సంస్థ సేవల పట్ల పట్ల గ్రామ సర్పంచులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం భాష, అసిస్టెంట్ మేనేజర్ మధుప్రియ, ప్లాంట్ ఇంచార్జ్ సంజీవరెడ్డి, హెచ్ ఆర్ అజిత్, శ్రీనివాస్, సంస్థ బృందం సభ్యులు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం.

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి.

గీసుగొండ ఏప్రిల్ 23 ప్రభాతవార్త.

గీసుగొండ మండలంలోని ఎల్కుర్తి హవేలీ గ్రామంలో ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి నూతన గృహ నిర్మాణ భూమి పూజ, గృహప్రవేశ, చలివేంద్ర ప్రారంభోత్సవం లాంటి కార్యక్రమాలలో ఈరోజు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూపేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఏజెన్సీ ద్వారా ఇళ్ల నిర్మాణం నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులకు శాలువాలతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఇల్లు కట్టుకోలేని ఆర్థిక ఇబ్బందులో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి,ఏజెన్సీ ద్వారా ఇల్లు కట్టి ఇస్తున్న10 నూతన ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని అన్నారు.

## డంపింగ్ యార్డు రద్దుకు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన...

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

గత 32 రోజులుగా డంపింగ్ యార్డ్ రద్దు కోసం ప్రజలు నిరసన తెలుపుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల అఖిలపక్ష నాయకులు హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకొని, నల్ల బెలూన్లు చూపుతూ గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ హుజూరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన డంపింగ్ యార్డ్ వల్ల ఒక్క హుజూరాబాద్ మాత్రమే కాకుండా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలు సైతం ఇబ్బందులు పడతారని అన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల వాయు కాలుష్యం నీటి కాలుష్యం శ్రద్ధ కాలుష్యం అవుతాయని అన్నారు. పర్యావరణం దెబ్బతినడంతో ప్రజలు అనారోగ్య పాలవుతారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తించి డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచించి రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఈశ్వర్ రెడ్డి, ఎడ్ల విజయ్ కుమార్, కొలిపాక సమ్మయ్య, ఎల్లయ్య, వేల్పుల ప్రభాకర్, తునికి సమ్మయ్య, టి.వెంకట్రావు, మార్త రవీందర్, లక్ష ్మణమూర్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట సెక్టార్ పరిధిలో ఘనంగా ముగిసిన పోషకాహార పక్షోత్సవాలు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జమ్మికుంట సెక్టార్ స్థాయిలో అత్యంత వైభవంగా కేశవాపూర్ అంగన్వాడి కేంద్రం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కౌన్సిలర్ పాతకాల మోనిక, సి.డి.పి.ఓ సుగుణ హాజరై, ముగింపు వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సి.డి.పి.ఓ సుగుణ మాట్లాడుతూ.. సమాజంలో పోషకాహార లోపాన్ని పారద్రోలడమే లక్ష ్యంగా ఈ పక్షోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కౌన్సిలర్ పాతకాల మోనిక మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్ల విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ పద్మ పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజుఅంగన్వాడీ టీచర్ శివభారతిజమ్మికుంట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయా కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా పోషకాహార సంకల్పంపై అందరితో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ముగించారు.



## సీ ఓ ఈ లో సీట్లు సాధించిన విద్యార్థులు...

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

తెలంగాణ రాష్ట్ర ఏం.జే.పి. బిసి గురుకుల పాఠశాల, కళాశాలల సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పాఠశాల అనంతారం యాదాద్రి భువనగిరి జిల్లా పాఠశాలలో ప్రవేశం కోసం జరిగిన



పరీక్షలో రామకృష్ణ కాలనీ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఐదుగురు రెండు దశల పరీక్షలో అర్హత సాధించి ఎంపిక అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ పింగిలి వెంకటరమణ తెలియజేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొత్తంలో 40 మంది బాలురు ప్రవేశ పరీక్ష రాయగా మా పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారని ఈ విద్యార్థులకు 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు పూర్తి ఉచిత విద్యతోపాటు ఐఐటి జేఈఈ, నీట్ స్థాయి పరీక్షలకు కూడా శిక్షణ ఉంటుందని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ విద్యార్థి ఎంపిక

కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:




కరీంనగర్ కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆదిత్య సాయి అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్ తెలిపారు. మే 28వ నుంచి జూన్ 1వరకు నేపాల్ దేశంలో నిర్వహించనున్న అంతర్జాతీయ కరాటే పోటీలలో, ఆదిత్య సాయి అండర్14, 35కిలోల విభాగంలో కటా, కుమిటే విభాగాలలో పాల్గొంటారని తెలిపారు. దేశానికి ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షి స్తూ కోచ్ ప్రసన్న, క్రీడాకారుడు ఆదిత్య సాయిను పాఠశాల కరస్పాండెంట్ ,ప్రిన్సిపాల్ అర్చన అభినందించారు.

## తహసిల్దార్ ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని సొంత గ్రామంలోని వారి స్వగ్రామానికి వెళ్లి, మరణించిన నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవీందర్, మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి, మున్నూరు కాపు సంక్షేమ సంఘం జమ్మికుంట అర్బన్ అధ్యక్షులు ఏబూసి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల ప్రవీణ్ కుమార్ పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## మొలుగూరి సదయ్యను సన్మానించిన దళిత సంఘం నాయకులు...

జమ్మికుంట టౌన్ ప్రభా(

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియామకం అయిన సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని ఆయన కార్యాలయంలో దళిత సంఘ నాయకులు, సంఘమిత్ర సొసైటీ ఫౌండర్ సరిగొమ్ముల హరిప్రసాద్



దళితరత్న సరిగొమ్ముల మనోహర్, మంద శివ శంకర్, రామంచ రాకేష్, మామిండ్ల మల్లయ్య, కునబోయిన కుమార్ లు మొలుగూరి సదయ్యను శాలువతో ఘనంగా సన్మానించారు. దళిత రత్న మనోహర్ మాట్లాడుతూ మొలుగూరి సదయ్య సామాన్య కాంగ్రెస్ కార్యకర్త స్థాయి నుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సదయ్య మాట్లాడుతూ దళిత వర్గాలకు ప్రభుత్వం ధ్వారా ఏ అవసరం ఉన్న నా దృష్టికి తీసుకవస్తే ఆ పనులు చేయించడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## మడిపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో గురువారం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల వెంకటేష్



ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల వెంకటేష్ మాట్లాడుతూ రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోకుండా ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించి ప్రభ్నుత్వ నిర్ణయించిన మద్దతు ధరలు పొందాలని సూచించారు. రైతులు ఆరబెట్టిన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల వెంకటేష్ ఉపసర్పంచ్ కస్తూరి శ్రీనాథ్, సిఏలు ప్రియాంక, పరమేశ్వరి, స్వప్న వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు రూ 6 వేలు ప్రేమ కానుక అందజేసిన శ్రీసత్యసాయి బాబా సేవాసమితి...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 15 వ ఆరాధన మహోత్సవం పురస్కరించుకొని గురువారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపెల్లిలో గల స్పందన అనాధ ఆశ్రమంలోని అనాధ పిల్లలకు స్వామి వారి ప్రేమ కానుకగా రూ 6000 నగదును ఖర్చుల నిమిత్తం వారికి అందజేశారు. అలాగే పిల్లలందరికీ ఐస్ క్రీమ్స్ అందించడం జరిగిందని సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ గన్ను సతీష్ కుమార్ మహిళా యువ సమన్వయకర్త సాయి మాధురి, సాయి సత్య శ్రీ, సాయి నిత్యశ్రీ, బచ్చు సాయికృష్ణ పాల్గొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు ప్రాణవాయువు

### మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు ప్రాణవాయువు అని మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ పేర్కొన్నారు జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ . మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు హైకోర్టులో వెలువడిన తీర్పు చెంప మీద కొట్టినట్టు ఉందని ఈ తీర్పు యావత్ తెలంగాణ ప్రజలు మరియు రైతన్నల విజయంగా భావించవచ్చు అని అన్నారు .. కాళేశ్వరంప్రాజెక్ట్ కట్టకముందు ఏసంగి పంటకు నీరు లేక బీడీ భూములు ఉండేవని కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన తర్వాత రెండు పంటలకు సరిపడే నీళ్లు ఇచ్చి లక్షల ఎకరాల భూమి సాగు చేశారని అన్నారు. .. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదో ఒక విధంగా కేసీఆర్ ప్రతిష్ట దిగదార్చుతేనే నన్ను ఒక ముఖ్యమంత్రిగా గురుస్తా గుర్తిస్తారని కుట్రపూరితంగా చేసిన చర్యలు అని అన్నారు... తెలంగాణ రాష్ట్రం సాధించిన వ్యక్తి తెలంగాణ బాగు కోరుకునే వ్యక్తి కేసీఆర్ గారు తెలంగాణను నాశనం చేయాలని నిర్వీర్యం చేయాలనే ఆలోచన కేసీఆర్ కు బిఆర్ఎస్ పార్టీకి ఉండదని అన్నారు... కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ఒక కల్పతరువు లాంటిది,తెలంగాణలో ప్రతి గుంటకు నిరంధించిన అపర భగీరథుడు కేసీఆర్ గారు అని అన్నారు.. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు రూరల్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు బి ఆర్ ఎస్ కౌన్సిలర్ లు అవారి శివ కేసరి బాబు కోరుగాంటి రాము సామల్ల శేఖర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్ మాజీ పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు బి ఆర్ ఎస్ నాయకులు ఓద్ది రామ్ మోహన్ కచ్చు హరీష్ గుండా మదు ఎల్లా రాజన్న హరీష్ శ్రీరాముల గంగాధర్ అనురాధ కస్తూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పోషణ్ పక్వాడ వేడుకలు

**జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:**

ఐసీడీఎస్ జగిత్యాల ప్రాజెక్ట్,పొలాస సెక్టార్ పరిధిలోని రూరల్ ధర్మారం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఖిపోషణ్ పక్వాడఖి ముగింపు ఉత్సవం అంగన్వాడీ ప్రీస్కూల్ ఖిగ్రాడ్యుయేషన్ డేఖి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.గ్రామ సర్పంచ్ పరమల సుమలత మల్లేష్, ఉపసర్పంచ్ దీకొండ ప్రేమ్ నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు,తల్లులు అంగన్వాడీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ,2018లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పోషణ్ పక్వాడ ముఖ్య ఉద్దేశ్యం దేశ జనాభా ఆరోగ్యాన్ని మెరుగుపరచడమేనని తెలిపారు.గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార దినోత్సవంలో భాగంగా పిల్లల ఎత్తు,బరువులను నమోదు చేసి,లోప పోషణ,అతి తీవ్ర లోప పోషణ ఉన్న పిల్లలను గుర్తించి తగు జాగ్రత్తలు సూచించారు. పోషకాహార అలవాట్లలో మార్పు కోసం వివిధ రకాల పోషకాలున్న ఆహార పదార్థాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు.నీటి సమతుల్యత కోసం పిల్లలకు తరచూ నీరు,పాలు,పండ్ల రసాలు అందించాలని తల్లులకు అవగాహన కల్పించారు.అంగన్వాడీ ప్రీస్కూల్ పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలకు సిద్ధమైన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పిల్లల అభివృద్ధి నివేదికల ఆధారంగా వారికి స్టార్స్ కేటాయించి,తల్లిదండ్రుల సమక్షంలో వారి ప్రతిభను గుర్తించడం సంతోషకరమని సూపర్వైజర్ రాజశ్రీ తెలిపారు.చిన్నారులు తయారు చేసిన బొమ్మలు,ఇసుకతో ఆటలు వంటి స్వేచ్ఛయుత కార్యకలాపాల ద్వారా వారి శారీరక,మానసిక వికాసం పెరుగుతుందని పేర్కొన్నారు.ఇదే సమయంలో పిల్లలు అతిగా సెల్ ఫోన్ వాడటం వల్ల కలిగే నష్టాలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.కంటి చూపు మందగించడం,నిద్రలేమి,మెడ నొప్పి,అలసట ఆలోచనా శక్తి తగ్గడం వంటి సమస్యలతో పాటు చర్మ సంబంధిత అలర్జీలు వచ్చే ప్రమాదం ఉందని తల్లిదండ్రులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సరితారావు,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,ఉపాధ్యాయులు రజిత,మహిళా అధ్యక్షురాలు హేమలత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## కఠిన సేవా పథకాన్ని అందుకున్న సీఐ రవీందర్

**బయ్యారం,ఏప్రిల్23,ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025సంవత్సరానికి గాను ప్రకటించిన కఠిన సేవా పథకానికి గార్ల,బయ్యారం సీఐ రవీందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ ఎస్పీ డాక్టర్ శబరీష్ చేతుల మీదుగా గురువారం పథకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఎస్పీ సీఐ రవీందర్ను ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలను అందిస్తున్నందుకు సీఐ రవీందర్ను ప్రశంసించారు. నేర నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారం, శాంతి భద్రతల పరిరక్షణలో చూపుతున్న కృషి ప్రశంసనీయం అన్నారు. ఇకముందు కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిస్తూ ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

## జగ్గుతండ జిపిలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

**బయ్యారం,ఏప్రిల్23,ప్రభాతవార్త:**



బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీలో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల కోసం పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ బొల్లి జయంతివెంకటకృష్ణ ప్రారంభించారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణికులు, స్థానికులు శుభ్రమైన త్రాగునీటిని సులభంగా పొందగలుగుతారని సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా ఎండల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని స్థానికులు పెర్కొన్నారు. గ్రామ ప్రజల అత్యున్నత సేవలు అందిస్తున్న జగ్గుతండ పంచాయతీ పాలకవర్గం సేవలను పలువురు కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రూపేష్, పావని, దుర్గారావు, లలిత, రాఘవేంద్రరావు, కాంగ్రెస్ నాయకులు రాందాస్, వీరారెడ్డి, నాగేందర్, నాగూల్మీరా, ఆనంద్, సిపిఐ ఎం.ఎల్ పార్టీ నాయకులు సత్యం, సూర్యం, గ్రామపెద్దలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి, వెంకన్న, సునిల్, సాయి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

**బయ్యారం,ఏప్రిల్23,ప్రభాతవార్త:**

బయ్యారం మండలం రెడ్యాతండా గ్రామానికి చెందిన బానోత్ అక్షయ్ రవిరాథోడ్(43) అనే వ్యక్తి అటవీశాఖ అధికారిని ఫోన్ ద్వారా బెదిరించిన ఘటనలో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వారం రోజుల క్రితం బయ్యారం ఎఫ్ఆర్ఓ సువర్చల రెడ్డికి కాల్ చేసి ధర్మాపురం వద్ద టెంపుల్ నిర్మాణాన్ని ఆపవద్దని హెచ్చరించాడని వాట్సప్ గ్రూపుల్లో అధికారులపై అసభ్యకర పదజాలంతో బెదిరింపు సందేశాలు పోస్ట్ చేసినట్లు పిర్యాదు అందగా కేసు నమోదు చేసి హైద్రాబాద్లో ఉన్న నిందితున్ని గురువారం బయ్యారం పోలీసులు అదుపులోకి తీసుకొని మొబైల్ఫోన్ను స్వాదీనం చేసుకొని నిందితునికి రిమాండ్ తరలించినట్లు బయ్యారం ఎస్సై కే.తిరుపతి తెలిపారు. ఇదేవిధంగా బయ్యారం మంలంలో ప్రజాప్రతినిధులను కాంట్రాక్టర్లను, ఉద్యోగస్తులపై ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు పోస్టులు పెట్టేవారిపై కూడా కేసులు నమోదు చేసి రిమాండ్కు తరలిస్తామని బయ్యారం ఎస్సై తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేసిన మాజీ కౌన్సిలర్

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త** : సిరిసిల్ల పట్టణంలో ఈదర గాలుల బీభత్సానికి 17 వ వార్డు గాంధీనగర్ మార్కెట్ రోడ్ లో గల నాలుగు అంతస్తుల భవనం పై గోడ కూలి పక్కన ఉన్న రేకుల ఇంటి పైన పడడంతో ఇంటిలో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఇద్దరు అమ్మాయిల పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని కరీంనగర్ కి తరలించారు . మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఏరియా ఆస్పత్రికి వెళ్లి గాయాలపాలైన కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## ప్రభుత్వ పాఠశాలకు కుర్చీల వితరణ



**గార్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:**

మండలంలోని మద్దివంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ సైన్స్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న టిఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షరీఫ్ 10కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతారామయ్యకు ఉపాధ్యాయుల సమక్షంలో బహుకరించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రజిత, హెడ్మాస్టర్ సీతారామయ్య, ఉపాధ్యాయులు సీతారాములు, నాగేశ్వర రావు, పెంట్యా, నర్సింహ, రేణుక, జితేందర్, మంగిలాల్ విద్యార్థుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు సుందర్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పాఠశాల, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరం

**చిన్నగూడూరు,ఏప్రిల్23,ప్రభాతవార్త:**



విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల, విద్యార్థుల తల్లిదండ్రులు సమన్వయం అత్యంత అవసరమని జయ్యారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. గురువారం పాఠశాల చివరి రోజు కావడంతో పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థుల్లో విద్యా పురోగతి, హాజరు, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై విస్తృతంగా చర్చించారు. ఈ విద్యాసంవత్సరాన్ని విజయవంతంగా పూర్తిచేసినందున కృతజ్ఞతలు తెలిపారు.

## ఐడీఓసీ జగిత్యాలలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి

రెవిన్యూ అదనపు కలెక్టర్ బిఎస్ లత

భగీరథ మహర్షి సేవలు సమాజానికి ఆదర్శం

మహానీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి వేడుకలు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

మహానీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలనీ అదనపు కలెక్టర్ బిఎస్ లత పేర్కొన్నారుఐడీఓసీ జగిత్యాల భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రెవిన్యూ అదనపు కలెక్టర్ బిఎస్ లత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ, సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు. మహానీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం వారి జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారిణి జి సునీత, కలెక్టరేట్ ఏవో కిషన్, వివిధ జిల్లా అధికారులు, అధికారులు, సంఘ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ప్రారంభించిన జువ్వాడి నర్సింగ రావు.

మల్లాపూర్, ప్రభాతవార్త:



మండలంలోని కొత్త దామరాజ్ పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు గురువారం 16ఇళ్లను ప్రారంభించారు .అనం తరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ పేదల ప్రభుత్వమని, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్ళు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ లింబాద్రి ,మాజీ ఎంపీపీ బద్దం నరసారెడ్డి, మండల అధ్యక్షులు పూంద్ర శ్రీనివాసరెడ్డి, కిరణ్, ఏఎంసీ చైర్మన్ పుష్పలత, మాజీ సర్పంచు లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు : తహసీల్దార్ నీత.

మెట్‌పల్లి,ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించబడ్డాయని, తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తహసీల్దార్ నీత అన్నారు. మండలంలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ముఖ్య అతిథిగా తహసీల్దార్ నీత పాల్గొన్నారు.ఈసందర్భంగా తహసీల్దార్ నీత మాట్లా డుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి సౌకర్యాలు,మంచి పరిజ్ఞానం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని, పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు పొందాలని తెలిపారు.20252026 విద్యా సంవత్సరంలో 6 నుండి 9వ తరగతి చదివిన విద్యార్థులకు ప్రగతి పత్రాలు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అంద జేయడం జరిగింది.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి,ఆర్ఐ ఉమేష్,ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,జిపివో నాగరాణి,ఉపాధ్యాయులు రాజారామ్,రజిత,చంద్రయ్య, స్కైలాబ్, సత్యనారాయణ, సురేఖ,తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



మండలం డబ్బా గ్రామానికి చెందిన కంఠం రాజ్ కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరి కాగా చెక్కును కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న ఈ సహాయం బాధితులకు అవసరమైన సమయంలో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్, మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, పుప్పాల పెద్ద గజేందర్, పుప్పాల చిన్న గజేందర్, భూస ప్రశాంత్, అమిలాల్ శ్రీనివాస్, దేశెట్టి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సాంప్రదాయ విలువలు పాటించాలి

జగ్గాసాగర్ లో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ.
సత్యానంద ఆశ్రమం విశోక తీర్థ స్వామీజీ.







**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** హిందూ సాంప్రదాయ విలువలు ప్రతి ఒక్క హిందువు పాటించాలని, ముఖ్యంగా హిందువులు తప్పకుండ నుదుటి పై కుంకుమ ధరించాలని సత్యానంద ఆశ్రమం విశోక తీర్థ స్వామీజీ అన్నారు.మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం,ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ విశోక తీర్థ స్వామీజీ గురువారం ఆవిష్కరించారు.అనంతరం గ్రామంలోని రామాలయం వద్ద హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించగా..వక్తలు బంధనకంటి శ్రీమన్నారాయణ చారి, గుండేటి స్వప్న లు మాట్లాడుతూ..దేశంలో హిందువులు ఏకమైనప్పుడే భారతదేశం గొప్పగా ఉంటుందని,కుల మతాలతో విభేదాలు తెచ్చుకోకుండా ఒకటిగా జీవిద్దామని పిలుపునిచ్చారు.దేశానికి మూల స్తంభం హిందూ సంస్కృతి, సాంప్రదాయాలేనని,కొన్ని శక్తులు హిందూ ధర్మాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి చర్యలు తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. అలాగే మన హిందూ సంస్కృతి సాంప్రదాయాల గురించి, కుటుంబ వ్యవస్థ గురించి వివరించడం జరిగింది.కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిల సాంప్రదాయ నృత్యాలు అలరించాయి. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ పుల్ల సాయగౌడ్, ఉప సర్పంచ్ లక్మ చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు టి ఆర్ పి సంపూర్ణ మద్దతు

**రాష్ట్ర కార్యదర్శి ఆకుల హన్మాండ్లు.**



**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు రాష్ట్ర కార్యదర్శి ఆకుల హన్మాండ్లు అన్నారు.పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులను గురువారం టి ఆర్ పి నాయకులు కలిసి మద్దతు ప్రకటించారు.ఈసందర్భంగా టి ఆర్ పి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి ఆకుల హనుమాండ్లు మాట్లాడుతూ..ప్రభుత్వం మొండి వైఖరి వీడి కార్మికులు కోరుతున్న 32 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, వేతన సవరణ,ఉద్యోగ భద్రత,పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని ,మహిళా కార్మికులకు తగిన రక్షణ మరియు సౌకర్యాలు కల్పించాలి,డ్యూటీల గంటలను నియంత్రించి, విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని వారు కోరారు.ఈకార్యక్రమంలో టి ఆర్ పి జిల్లా మహిళా అధ్యక్షురాలు కోటగిరి మమత,మెట్‌పల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలు క్యాతం లావణ్య, రైతు విభాగం అధ్యక్షులు ఆకుల అంజయ్య ,రైతు విభాగం ఉపాధ్యక్షులు గోనెలా రాజారెడ్డి, పొన్నం నవీన్, పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నాం

## మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో కూలింగ్ వాటర్ ఫిల్టర్ ప్రారంభం

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రముఖ వ్యాపారి మహాజన్ నర్సింలు తన తల్లిదండ్రులు మహాజన్ భూమయ్య గంగుబాయి ల స్మారకార్థం కూలింగ్ వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ ఫిల్టర్‌ను గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ప్రారం భించారు. ఈ సందర్భంగా కూన గోవర్ధన్ మాట్లాడుతూ, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌కు వచ్చే రైతులు, హమాలీ కార్మికులు, ఇతర సిబ్బందికి తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఫిల్టర్‌ను అందజేసిన మహాజన్ నర్సింలుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరు నవీన్, వ్యాపారులు మహాజన్ నర్సింలు, పుప్పాల చిన్న అంజయ్య, మ్యాన నడిపి శ్రీనివాస్, నిమ్మల భూమా రెడ్డి, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఆపరేటర్ సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మెట్‌పల్లి సిఐ గా సురేష్ బాబు

మెట్‌పల్లి, ప్రభాతవార్త:



జిల్లా పోలీసు శాఖలో బదిలీలలో భాగంగా మెటుపల్లి సిఐ గా సురేష్ బాబు ను నియమిస్తూ మల్టీ జోన్1 ఐజీ కార్యాలయం నుండి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కోరుట్ల సీఐగా పనిచేస్తున్న సురేష్ బాబును మెట్‌పల్లి సీఐగా నియమిస్తూ, మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్ ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

## భక్తుల సౌకర్యార్థం గ్రీన్ మ్యాట్లు

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త ::

ఎండ తీవ్రత విపరీతంగా పెరగడంతో దర్శనానికి వచ్చే భక్తుల ఇబ్బందులను గ్రహించి పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం గ్రీన్ మ్యాట్లు ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టూ ఇసుక ఉండటంతో భక్తులకు ఎండ వేడిమిలో నడవటం చాలా ఇబ్బందిగా మారిందని అందుకనే గ్రీన్ మ్యాట్లు ఏర్పాటు చేసి పరిచినట్లు ఈవో ఇమ్మడి భాస్కర్ తెలిపారు. దీంతో భక్తులకు కాస్త ఉపశమనం కలుగుతుందని ఈవో భాస్కర్ అన్నారు.